
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 9 సెప్టెంబరు 2025

అరటి కిలో రూ.4


అరటికి వ్యాపించిన సిగటోగ తెగులు



రైల్వేకోడూరులో సాగవుతున్న అరటి



అరటి కాయలకు మచ్చలు ఏర్పడిన దృశ్యం



- కుదేలైన రైతు
- తెగుళ్లతో తోటల్లోనే మాగుతున్న కాయలు
- కోట్లాది రూపాయల నష్టం

రైల్వేకోడూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అరటి రైతు కుదేలయ్యాడు. తెగుళ్లతో కాయలకు మచ్చలు రావడంతో కొనేవారు లేక తోటల్లోనే కాయలు మాగిపోతున్నాయి. మొన్నటి వరకు రూ.25 నుంచి రూ.10 వరకు పలికిన ధరలు నేడు ఒక్కసారిగా కుప్పకూలి రూ.4కు చేరుకుంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అరటికి సిగటోగ, మచ్చ తెగుళ్లు, బంగారు ఈగల దాడితో ధరలు కుప్పకూలిపోయాయి. కిలో రూ.4లకు కూడా విక్రయాలు జరగడం లేదు. తోటల్లోనే కాయలు మాగిపోతున్నాయి. నెల రోజుల నుంచి బొప్పాయి ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళనకు దిగడం తెలిసిందే. బొప్పాయి రైతుల సమ్మెతో దళారులు దిగి వచ్చి ధరలను పెంచారు. ప్రస్తుతం అరటి ధరల పరిస్థితి దారుణంగా మారింది.

ధరలు లేకపోవడంతో రైతులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. తెగుళ్లతో మార్కెటింగ్ ఒక్కసారిగా పడిపోయింది. మామిడి తర్వాత అరటి తోటలు రైల్వేకోడూరు నియోజకవర్గంలో సాగు అత్యధికంగా ఉంది. అరటికి రైల్వేకోడూరు ప్రాంతం పెట్టింది పేరు. దక్షిణ భారతదేశంలోనే కాకుండా ఇతర నగరాల్లో ఇక్కడి అరటి కాయలకు మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది మొదట్లో అరటి కాయలు కిలో రూ.25, పలకగా అనంతరం రూ.10 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం ఉన్నట్లుండి రూ.4కు పడిపోయింది. దీంతో అరటి రైతు ఒక్కసారిగా డీలా పడిపోయాడు. మార్కెటింగ్ లేక కొనే వారు లేక అరటి రైతులు తోటలను నరికివేసేందుకు సిద్ధమయ్యారు. కావాలనే కొందరు వ్యాపారులు మార్కెట్ లేదని సాకు చెప్పి ధరలను తగ్గించారని రైతులు వాపోతున్నారు. అరటి ఆకులు, పువ్వులు, కాండం, కాండంకు ఉన్న తాట వరకు ఉపయోగంలో ఉన్నాయి. కొందరు రైతులు ధర పోతే పోయింది ఆకులన్నా అమ్ముకుంటామని అనుకుంటున్నారు. అదే కాకుండా అరటి తోటలకు సిగటోగ, మచ్చ తెగుళ్లు, బంగారు ఈగల దాడులతో కాయలు దెబ్బతింటున్నాయి. రైతులు అనేక రకాల పురుగు మందులు పిచికారీ చేశారు. ఈ తెగుళ్లు అరటి రైతుల కొంపముంచాయి.

రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాలకు చెందిన రైతులు పచ్చఅరటిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఒక్క టిష్యూ కల్చర్ అరటి మొక్క రూ.16 పడుతుంది. ఎకరాకు 1200 మొక్కలు పడతాయి. ఆరు నెలలకు కాపుకు వస్తుంది. గెలలు పెద్దవిగా ఉంటాయి. 9 నెలలకు కోతకు వస్తుంది. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చు వస్తుంది.

ఒక్క మొక్కకు ఖర్చు రూ.80 నుంచి రూ.100 వరకు వస్తుంది. ఈ ఏడాదిలో నర్సరీల నుంచి సుమారు కోటి మొక్కలు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. రైల్వేకోడూరు నుంచి మహారాష్ట్ర, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, నెల్లూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు అరటి కాయలను రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. ధరలు పడిపోవడంతో సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని, చేసిన అప్పులు తీర్చ లేక, పెట్టుబడికి వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లు లేని అరటి కాయలను మాత్రమే వ్యాపారులు తీసుకుంటున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 20 వేల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. అరటికి ప్రభుత్వం గిట్టుబాటు ధరలను కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అరటి రైతులకు గిట్టు ధర కల్పించాలి



అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. ధరలు కుప్పకూలిపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడి రావడం లేదు. ప్రస్తుతం అరటి కాయలను కొనేవారు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సాగు అయిన ఖర్చు కూడా రావడం లేదు. ప్రభుత్వం గుర్తించి గిట్టుబాటు ధరలను కల్పించాలి.

- దేశు క్రిష్ణారెడ్డి, రైతు, తూర్పుపల్లె

తెగుళ్లతో అరటి ధరలు కుదేలు



తెగుళ్లతో అరటి ధరలు కుదేలయ్యాయి. ప్రతి ఏటా తెగుళ్లు వస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దున్నకాలు, ఎరువులు, కూలీలు పెట్టి సాగు చేసినా కష్టానికి తగిన ఫలితం రావడం లేదు. గ్రాండ్-9 అరటి కాయలకు ప్రతి ఏటా మంచి డిమాండ్ ఉన్నా తెగుళ్ల కారణంగా ధరలు పడిపోయాయి.

- టి. నాగార్జునరెడ్డి, రైతు, అనంతరాజుపేట

అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



అరటి ధరలు పడిపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని అరటి తోటల్లో తెగుళ్లు లేవు. మార్కెటింగ్ లేక ధరలు పడిపోయాయి. అరటి కాయలను కొనేవారు లేరు. తోటల్లోనే కాయలు మాగిపోతున్నాయి. తోటల్లోకి పోవాలంటే మనసు అంగీకరించడం లేదు.

-శ్రీనువాసులు, రైతు, రైల్వేకోడూరు

యూరియా నిల్వలపై కలెక్టర్లతో సీఎం సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లతో యూరియా నిల్వలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ తన క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అవసరమైన యూరియా నిల్వలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా నిల్వలపై తప్పుడు సమాచారాన్ని ఇస్తూ రైతులను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రైవేటు డీలర్లు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మార్కెటింగ్ శాఖ అధికారులకు కలెక్టర్ వివిధ సూచనలు చేశారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



అర్జీదారుల సమస్యలు వింటున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జీఎస్‌డబ్ల్యుఎస్ లక్ష్మీపతి, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిశితంగా అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలోగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని కొండావాండ్లపల్లెకు చెందిన రేవన గోపాల్ వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని జేసీకి విన్నవించుకున్నారు. రాజంపేట మండలం రామ్‌నగర్ కాలనీకి చెందిన పసుపులేటి సుబ్బమ్మ తన 2009న మృతి చెందాడని, నాకు ఎలాంటి ఆస్తులు లేవని కూలి పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని, నాకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని వినతిపత్రం అందచేసింది.

దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా వీరభద్రుడు

రాజంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజంపేటకు చెందిన నాగూరి వీరభద్రుడిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీకి వీరభద్రుడును నియమించడంతో ఆ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు.

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవంపై ఏర్పాటు చేసి బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

తహసీల్దారు సంతకం ఫోర్జరీ కేసులో ఏడేళ్లు జైలుశిక్ష

- అదనంగా రూ.20 వేలు జరిమానా
- వాల్మీకిపురం న్యాయాధికారి తీర్పు

కలికిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలికిరి తహసీల్దారు సంతకాన్ని ఫోర్జరీ చేశాడనే అభియోగంతో నమోదైన కేసులో నేరం నిరూపణ కావడంతో ఏడేళ్ల జైలుశిక్ష పడింది. శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ వాల్మీకిపురం జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి గురు అరవింద్ సోమవారం తీర్పు ఇచ్చారని కలికిరి ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. కలికిరి పంచాయతీ వెంకటేశ్వరపురం కాలనీలో ఉండే గడ్డం శ్రీనివాసులు తహసీల్దారు సంతకాన్ని ఫోర్జరీ చేశారని 2017లో అప్పటి ఎస్ఐ పురుషోత్తంరెడ్డి కేసు నమోదు చేశారు. ఈ మేరకు కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన ముల్లంగి రమేష్ కలికిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపైన గడ్డం శ్రీనివాసులుపై చీటింగ్ కేసు నమోదు చేశారు. సరైన ఆధారాలతో పోలీసులు చేసిన దర్యాప్తు కారణంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్ బలమైన వాదనలు వినిపించడంతో న్యాయస్థానంలో నేరం రుజువైందని సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. దీంతో న్యాయాధికారి గురు అరవింద్‌కు ఏడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు. కేసు దర్యాప్తులోనూ, సాక్షులను ప్రవేశపెట్టడంలోనూ చురుగ్గా వ్యవహరించిన సీఐ అనిల్‌కుమార్, కోర్టు కానిస్టేబుల్ రెడ్డెప్పలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌లు అభినందించారు.

మట్టి తరలింపులో బురిడీ

6

- వ్యవసాయ భూముల పేరుతో రియల్ భూములకు
- నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ అనుమతులు

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయొద్దు

- అదనపు ఎస్పీ వెంకటాద్రి



బాధితులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. పలు సమస్యలపై జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని బాధిత ప్రజలు జిల్లా పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని ఆయన సూచించారు.

నానో యూరియాతో లాభాలు

- జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



నానో యూరియా గురించి వివరిస్తున్న డీఏవో శివనారాయణ

కలికిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాను వినియోగించుకోవడానికి అలవాటుపడితే అనేక రకాల లాభాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) శివనారాయణ తెలిపారు. కలికిరి పంచాయతీ అంకెంవారిపల్లెలో సోమవారం నానో యూరియా వినియోగంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలని, దీని కారణంగా పెట్టుబడులు తగ్గడం, అధిక దిగుబడులు సాధించడం, శ్రమ తగ్గి రైతులకు వెసులుబాటు కలగడం, సమయం కలిసిరావడం వంటి లాభాలున్నాయని వివరించారు. మామూలు గుళికల యూరియా స్థానంలో నానో యూరియాతో తక్కువ ఖర్చు, తక్కువ సమయంతో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయొచ్చని చెప్పారు. ఫలితాలు కూడా నానో యూరియాతో మెరుగ్గా ఉంటాయని చెప్పారు. పిచికారీ పనికి డ్రోన్ లాంటి ఆధునిక సాంకేతిక పరికరాల వైపు మొగ్గు చూపాలన్నారు. కేవీకే కో-ఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ అజొల్లా, అజోస్పైరిల్లంలాంటి జీవన ఎరువులను వాడటం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం నేరుగా రైతులకు అవగాహన కలిగే విధంగా నానో యూరియాను డ్రోన్ ద్వారా పిచికారీ చేయించి దాని వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ఏడీఏ నాగప్రసాద్, ఎంపీడీవో భానుమూర్తి రావు, కలికిరి సర్పంచు యల్లయ్య, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, ఎంఏవో హేమలత, శాస్త్రవేత్త సోమశేఖర్, ఆత్మ బీటీఎం అమృత్ రెడ్డి, ఏఈవో ఇంద్ర, ఆరెస్కే ఇన్‌చార్జ్ జహీర్, పలువురు రైతులు, ఇఫ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి

- డీఆర్వో మధుసూదన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని డీఆర్వో మధుసూదన్‌రావు బ్యాంకర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో డీఆర్వో అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు సరైన సమయంలో చేరేందుకు బ్యాంకులు ప్రధానపాత్ర పోషిస్తూ జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు బ్యాంకింగ్ రంగం భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ ఏడాది మొత్తం రూ.16,619 కోట్ల వార్షిక రుణ లక్ష్యానికి ఇప్పటికి వరకు రూ.5,523 కోట్లు మాత్రమే సాధించామని, మిగిలిన లక్ష్యాన్ని నిర్దేశిత త్రైమాసికాల వారీగా పూర్తి చేయాలని బ్యాంకర్లకు సూచించారు. సూక్ష్మ, చిన్ననీటి పరిశ్రమలకు 28 బ్యాంకులకు లక్ష్యం ఇచ్చినప్పటికీ కేవలం 14 బ్యాంకులు మాత్రమే ప్రగతిని సాధించాయన్నారు. గృహ నిర్మాణ రుణాలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి వ్యక్తికి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకులను కోరారు. స్వయం సహాయక సంఘాలకు ఈ-ముద్ర రుణాల కింద ఈ ఏడాది మొత్తం 39 మంది లబ్ధిదారులకు రూ.107 కోట్లు మంజూరు చేయాల్సి ఉందని, తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద పెండింగ్‌లో ఉన్న 1,425 దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ఆర్బీఐ ఎల్డీవో నవీన్‌కుమార్, స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కోటిరెడ్డి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుశాంత్‌కుమార్, నాబార్డ్ అధికారి విజయవిహారి, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ బాషా, కేడీసీసీ బ్యాంక్ సీఈవో రాజమణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


పీలేరుకు లైఫ్ సపోర్ట్ అంబులెన్స్



పీలేరులో అందుబాటులోకి వచ్చిన ఆధునిక లైఫ్ సపోర్ట్ అంబులెన్స్

పీలేరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రాంతీయ ఆసుపత్రికి ఆధునిక 108 అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ వచ్చింది. జిల్లాలోని పీలేరు, మదనపల్లె, రాయచోటి, రాజంపేట, ములకలచెరువు కేంద్రాలకు కొత్త అంబులెన్స్‌లు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం పీలేరులో జిల్లా 108 అంబులెన్స్ మేనేజర్ సుబ్రమణ్యం పచ్చజెండా ఊపి కొత్త అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యవసర పరిస్థితులలో తక్షణ వైద్య సహాయం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తీవ్రమైన ప్రమాదాలు, గుండె పోటు, ప్రమాదకర గాయాలు వంటి అత్యవసర పరిస్థితులలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సాధారణ 108 అంబులెన్స్‌తో పోల్చితే ఇందులో ఉన్న సౌకర్యాలు మరింత ఆధునికంగా ఉండడం వల్ల రోగి ప్రాణాలు కాపాడే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ సూపర్‌వైజర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయం ముందు ఉన్న వ్యూ పాయింట్ నుంచి అడవుల అందాలు



వాచ్‌టవర్‌తో అడవుల రక్షణ

వాచ్‌టవర్లు పర్యాటకులు అడవులను సందర్శించడానికే కాకుండా అడవుల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయి. వాచ్‌టవర్ పైకి ఎక్కి పరిశీలిస్తే అడవిలో ఎక్కడ ఏం జరుగుతున్నా తెలుసుకోవచ్చు. అటవీ అధికారుల పర్యవేక్షణ పెరిగి చెట్లు నరకివేత, వన్య ప్రాణుల వేట వంటివి ఆగిపోయే అవకాశం ఉంటుంది. వేసవిలో అడవుల్లో మంటలు చెలరేగితే ఆ ప్రాంతాన్ని త్వరగా గుర్తించే వీలుంటుంది. వెంటనే ఆ ప్రాంతాలకు వెళ్లి మంటలను అదుపు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టవచ్చు. భవిష్యత్తులో వాచ్‌టవర్ వద్దకు టోల్‌గేట్ ద్వారా అటవీ శాఖకు ఆదాయం సమకూర్చుకునే అవకాశం కూడా ఉంటుంది. ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. కార్తీక సోమవారం, నూతన సంవత్సరం, మహాశివరాత్రి వంటి ప్రత్యేక రోజుల్లో రాయచోటి, మదనపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండ్యం తదితర పట్టణాల నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు కొండకు తిరుగుతుంటాయి.



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నూతనంగా నిర్మించిన వాచ్‌టవర్

ఆధ్యాత్మికం...ఆహ్లాదం

- పర్యాటక క్షేత్రంగా మల్లయ్యకొండ
- కొండ పైన వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణం
- మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు

వాచ్‌టవర్, పగోడాలతో ఆహ్లాదం


మల్లయ్యకొండ పైన ఆలయానికి ఉత్తర దిక్కున అర కిలోమీటరు ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడ ఎత్తయిన ప్రదేశంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.45 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఓ వాచ్ టవర్‌తో పాటు రెండు పగోడాలను నిర్మించారు. గౌరమ్మ కుప్ప వద్ద నిర్మించిన వాచ్‌టవర్ నుంచి చూస్తే మల్లయ్య కొండ చుట్టూ కొన్ని వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న దట్టమైన అడవులు, పచ్చని చెట్లు, కొండలు, లోయలను వీక్షించవచ్చు. ఇక్కడి వ్యూ పాయింట్ నుంచి తిరుమల కొండలు కనిపిస్తాయి. దీంతో పాటు వాచ్ టవర్ పక్కనే సందర్శకులు సేద తీరడానికి వీలుగా రెండు పగోడాలను నిర్మించారు. కొండకు వచ్చిన పర్యాటకులు పగోడాల కింద కూర్చుని చల్లటి గాలుల మధ్య ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సేదతీరవచ్చు.



నూతనంగా నిర్మించిన పగోడాలు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆధ్యాత్మికంతో పాటు పర్యాటక శోభ సంతరించుకుంది. జిల్లాలోనేపేరుగాంచిన పురాతన ఆధ్యాత్మిక శైవ క్షేత్రమైన మల్లయ్యకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో ప్రకృతి అందాల నడుమ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మూడు కొండల మల్లన్నగా పేరొందిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కొలువై ఉన్నాడు. మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. సోమవారం భక్తుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. కార్తీక సోమవారాల్లో వేలాది మంది భక్తులు, మహిళలు కొండకు వచ్చి భక్తిశ్రద్ధలతో గౌరీవ్రత నోములు నోచుకుంటారు. మహిళలు ఉపవాసంతో ఆలయ ధ్వజస్తంభం ముందు కోరిన కోర్కెలు నెరవేరాలని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు మొక్కుకుంటారు. ఏటా మూడు రోజుల పాటు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

వాచ్ టవర్ నుంచి కనిపిస్తున్న ప్రకృతి అందాలు





మల్లయ్యకొండ పైన దర్శించవలసిన ప్రదేశాలు

మల్లయ్యకొండపైన ఆలయానికి ఎగువ వైపున గౌరమ్మ ఆలయం ఉంది. కొండపైన సహజసిద్ధంగా ఏర్పడిన నిచ్చెనకొండ, ఎలుకతీర్థం, భగీరథీ కొలను (కోనేరు), అంతర గంగ, అన్నబేధి అనే పంచ తీర్థాలు ఉన్నాయి. వీటిలో సహజంగా ఊరిన నీటిని స్వామి వారి అర్చనలు, అభిషేకానికి ఉపయోగిస్తారు. స్వామి వారికి అభిషేకించిన నీటిని తీర్థంగా సేవిస్తే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం. నిచ్చెనకొండలో ఉన్న రాతిలో ఎంతటి కరువులో నైనా నీరు ఉండటం దైవ మహిమగా చెప్పుకోవచ్చు. భక్తులు నిచ్చెన ద్వారా నిచ్చెన గుండం ఎక్కి అందులోని నీటిని తీర్థంగా సేవిస్తారు. ఇంకా వీరన్న గెవి, చాకలివాని బావి, ఎర్రబావి (ఊటచలం) తదితర దర్శించవలసిన ప్రదేశాలు కొండపైన ఉన్నాయి.

కొండ పైన ఆహ్లాదకరమైన వాతావరణం

సముద్రమట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో ఉన్న సాదు, మల్లయ్యకొండ అడవి ప్రకృతి అందాలు ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు మల్లయ్యకొండ మొత్తం పచ్చదనం పరుచుకుంది. కొండపై నుంచి చూస్తే కనిపించే లోయలు, ఎత్తయిన కొండలు, రకరకాల చెట్లు, వన్యప్రాణులు, ఘాట్ మార్గంలోని మలుపులు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. కొండపైన శీతాకాలంలో ఊటీని తలపిస్తూ, వేసవిలో స్వచ్ఛమైన చల్లగాలులను అందిస్తూ, వర్షాకాలంలో అరకు అందాలను మైమరపించే విధంగా కాలానికి తగ్గట్టుగా కొండ పైన వాతావరణ పరిస్థితులు నెలకొని ఉంటాయి.

కోరిన కోర్కెలు తీర్చే మల్లన్న



మల్లయ్యకొండ పైన కూటమి ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మల్లన్న స్వామి కోరిన కోర్కెలు తీరుస్తుండటంతో భక్తుల తాకిడి పెరుగుతోంది. కొండకు వచ్చిన భక్తులు తొలుత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని తర్వాత గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం కొండ పైన వీరన్నగెవి, నిచ్చెనగుండం వంటి చూడదగ్గ ప్రదేశాలను తిలకిస్తూ ఉంటారు. కొండ పైన అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వాచ్‌టవర్, పగోడాలతో పర్యాటకులు పకృతి అందాలను తిలకిస్తూ మధురానుభూతిని పొందుతున్నారు.

-మునిరాజ, మల్లయ్యకొండ ఆలయ ఈవో

మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



మల్లయ్యకొండపైన పర్యాటకుల ఆహ్లాదం కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వాచ్ టవర్, రెండు పగోడాల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీంతో కొండకు వచ్చే పర్యాటకులు మంచి ఆహ్లాదం పొందుతారు. కొండపైన మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాం. కొండపైన ప్లాంటేషన్, ల్యాండ్ స్కేటింగ్, వాకింగ్ పాత్, ఉద్యానవనం పార్కు, వాచ్ టవర్, పగోడాల చుట్టూ హ్యాండ్ డ్రిల్ (స్టీల్ గ్రిల్‌తో రక్షణ గోడ)వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. సీఎస్ఆర్ నిధులు రాగానే అభివృద్ధి పనులు చేపడతాం.

- ఎఫ్ఆర్వో, జయప్రసాదరావు

రణభేరిని జయప్రదం చేయండి: యూటీఎఫ్



రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పీలేరురూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న రణభేరిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పీలేరులో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు. ప్రమోషన్లు, బదిలీ ప్రక్రియ పూర్తై మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా మినిమం టైంస్కేల్ జీతాలు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేయాల్సిన ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పనిచేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, మాజీ గౌరవాధ్యక్షుడు రాధాక్రిష్ణ, జిల్లా కౌన్సిలర్ వెంకటరమణ, చిన్నరెడ్డెప్ప, విజయకుమార్, పీరయ్య ఆదినారాయణ, కామేశ్వర తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ద్వారా రూ.4.03 లక్షలను నిరుపేద కుటుంబాలకు అందజేసినట్లు రాజం పేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఓ వరం అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకున్న కత్తి సుబ్బరాయుడుకు రూ.25,166, రాగినూతల వెంకటరమణకు రూ.20,254, కొప్పర్తి యానాదయ్యకు రూ.23,752, వెంకట సుబ్బయ్యకు రూ.45,798, పెంచలయ్యనాయుడుకు రూ.79,258ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా.. సీఎం సహాయనిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నారని కొనియాడారు.

31 డెంగ్యూ కేసులు నమోదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మలేరియా సబ్ యూనిట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెల వరకు 1,807 మంది రోగులకు డెంగ్యూ వ్యాధి టెస్టులు నిర్వహించినట్లు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి తెలిపారు. ఇందులో 31 మందికి డెంగ్యూ వ్యాధి నిర్ధారణ అయినట్లు ఆర్టీపీసీఆర్ ల్యాబ్ ద్వారా గుర్తించారని, మలేరియా సంబంధించి 3,086మంది వద్ద శ్యాంపిల్ తీసుకున్నట్లు తెలిపారు.


వృద్ధుడిపై పిచ్చికుక్క దాడి

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చిలకుంటలో ఓ పిచ్చి కుక్క వీరంగం చేసింది. అదే గ్రామానికి చెందిన రెడ్డెప్పనాయుడు(70) ఇంటి ముందు కూర్చుని ఉండగా, ఆయనపై దాడి చేసి గాయపరిచింది. వెంటనే స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

మట్టి తరలింపులో బురిడీ

- వ్యవసాయం పేరుతో రియల్ భూములకు
- నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ అనుమతులు

కురబలకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల పేరుతో మట్టి తరలింపునకు అనుమతులు పొంది ఆ మట్టిని రియల్‌ఎస్టేట్ భూములకు తరలిస్తూ ఇరిగేషన్ అధికారులను బురిడీ కొట్టించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'మట్టి మాఫియా బరితెగింపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కాగా మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లె చెరువు, వ్యవసాయ భూములలో మట్టిని తోలుకోవడానికి అనుమతుల కోసం ఇరిగేషన్ అధికారులకు ఈనెల 4న ఒక యువకుడు తమ పొలంలో మట్టిని తోలుకోవడానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే మట్టి తరలింపునకు ఇరిగేషన్ అధికారులు ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు 85 టిప్పర్లు లేదా ట్రాక్టర్‌ల మట్టిని తోలుకోవడానికి అనుమతులు ఇచ్చారు. జాతీయ రహదారి పక్కన ఉన్న భూములకు మట్టిని తరలించుకోవడానికి అనుమతులు కోరిన మరుసటిరోజునే ఎటువంటి విచారణ లేకుండా ఇరిగేషన్ అధికారులు మంజూరు చేయడంలో ఆంతర్యం ఏమిటో అంతుబట్టడం లేదని పలువురు స్థానికులు చెబుతున్నారు. సాధారణంగా ఎవరైనా అనుమతులు కోరిన తక్షణమే మంజూరు చేయడం అసాధ్యం. దీనికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి అనుమతులను మంజూరు చేస్తారు. అయితే కేవలం ఒక్క రోజులోనే అనుమతులు సాధించి రియల్ ఎస్టేట్ భూములకు మట్టిని తరలించుకోవడానికి అనుమతులు పొందారు. కాగా చెరువు నుంచి మట్టిని తరలించడానికి కేవలం అనుమతి పత్రంలో 5 టిప్పర్ల నెంబర్లకు అనుమతులు ఇవ్వగా మట్టిని వేసే జేసీబీ లేదా హిటాచీలను ఇందులో అనుమతులు ఇవ్వకపోవడం విశేషం. ఇవేవీ లేకుండా మట్టిని తరలించడానికి ఎలా సాధ్యమవుతుందో అంతుబట్టడం లేదు. ఈ విషయమై తహసీల్దార్ ధనంజయను వివరణ కోరగా ఇరిగేషన్ అధికారులు మంజూరు చేశారని తెలిపారు. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబును వివరణ కోరగా వ్యవసాయ భూముల అభివృద్ధి పేరుతో జాతీయ రహదారి పక్కనున్న భూములకు మట్టిని తరలిస్తున్నారని పలువురు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని, దీంతో మట్టి తరలింపును నిలిపేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎవరైనా మట్టిని అక్రమంగా తరలిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.



With reference to 1st cited, The Government of Andhra Pradesh had accorded permission to the farmers for excavation and transportation of silt at their own cost for non commercial purpose.

After careful examination of the representation the No Objection Certificate is hereby accorded for lifting of silt of 85 Tippers of silt with the

మట్టి తరలింపునకు ఇరిగేషన్ అధికారులు మంజూరు చేసిన లెటర్

ముగ్గురు ఐసీడీఎస్ సీడీపీవోలకు పెరిగిన 'ప్రెస్టేజీ'

- కుక్కర్ల గోల్‌మాల్ కేసులో ఎట్టకేలకు విముక్తి

కలికిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టులో సంచలనం కలిగించి పదేళ్ల పాటు చర్చనీయాంశంగా కొనసాగి అనేక మలుపులు తిరిగిన ప్రెస్టేజీ ప్రెజర్ కుక్కర్ల కొనుగోలు కేసుకు ఎట్టకేలకు సోమవారంతో తెరపడింది. ఈ కేసులో నిందితులుగా తేలిన వారిలో చివరగా మిగిలిన ముగ్గురు సీడీపీవోలకు విముక్తి కలిగిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2015 జూలై 22న కడప ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన ప్రెజర్ కుక్కర్లలో పెద్ద ఎత్తున నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఒక దినపత్రికలో 'ప్రెస్టేజీ పోయింది' శీర్షికతో ప్రచురించిన వార్త పదేళ్ళపాటు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణితో పాటు పలువురు సీడీపీవోలను ముప్పతిప్పలు పెట్టింది. అంగన్‌వాడీలకు ప్రెస్టేజి ప్రెషర్ కుక్కర్లను సరఫరా చేయాల్సి వుండగా తక్కువ కొలతలు కలిగిన నాసిరకం బ్రాండ్లతో కుక్కర్లను సరఫరా చేశారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై పీవో, సీడీపీవోలపై జిల్లా అధికారులు పోలీసు సూపరింటెండ్‌కు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసు నమోదుకు కూడా చర్యలు తీసుకున్నారు. కాలక్రమేణా వివిధ స్థాయిల్లో జరిగిన విచారణల ఫలితంగా క్రిమినల్ కేసులను ఉపసంహరించుకున్నారు. ఆ తరువాత క్రమంలో విచారణలు, సంజాయిషీలు, చివరికి తమకేమీ తెలియదని, ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారానే సరఫరా జరిగాయని, అనంతరం నాసిరకం కుక్కర్లు సరఫరా చేసిన ప్రొద్దుటూరు ఏజెన్సీకి వాటిని తిప్పి పంపి ప్రెస్టేజీ బ్రాండెడ్ కుక్కర్లు తెప్పించామని రకరకాలుగా కొంత మంది సీడీపీవోలు మొరపెట్టుకోగా పెన్షన్‌లో ఒక శాతం కోత విధించారు. చివరి వరకూ మిగిలిని ముగ్గురు సీడీపీవోలకు కూడా ఒక శాతం పెన్షన్ కోత నుంచి కూడా ప్రభుత్వం తాజాగా విముక్తి కలిగించింది. ఎట్టకేలకు కడప సీడీపీవో వి.అరుణకుమారి, కమలాపురంలో సీడీపీవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన సి.శ్రీమంతమ్మ, సిద్దవటం సీడీపీవో పి.భారతిలకు భారీ ఊరట లభించింది. అయితే కడప సీడీపీవో తప్పిదానికి అదనంగా దోషిగా ప్రభుత్వం నిర్ధారించడంతో ఆమెకు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు నిలిచి పోయాయి. వచ్చే ఏడాది 2026 జూన్‌లో పదవీ విరమణ చేయనున్న దృష్ట్యా తనకు విధించిన 'దోషి' (సెన్సూర్) శిక్ష నుంచి తప్పించాల్సిందిగా సీడీపీవో అరుణకుమారి చేసిన వినతులను పరిశీలించిన ప్రభుత్వం చివరికి ఆమెను కూడా నిర్దోషిగా పేర్కొంటూ ఊరట కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి రెండు వేర్వేరు ఆదేశాలు జారీ చేశారు.

గండికోటలో డ్రోన్ కెమెరాలతో పేకాట స్థావరాలపై దాడులు

- పోలీసుల అదుపులో 22 మంది ?
- భారీగా డబ్బులు స్వాధీనం

జమ్మలమడుగు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు తెలుస్తోంది. గతంలో జమ్మలమడుగులోని గండికోట, తదితర గ్రామాల్లో పేకాట, మట్కా బాగా జరిగినట్లు సమాచారం. అయితే నూతనంగా వచ్చిన సీఐ నరేష్‌బాబు ఉన్నట్లుండి జమ్మలమడుగులో ఆదివారం సాయంత్రం మూడు గంటల నుంచి పలు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అయితే పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఆదివారం సాయంత్రం పోలీసు అధికారులు వారి సిబ్బంది భారీగా పేకాట జరుగుతోందని ముందుగానే డ్రోన్ కెమెరాల ద్వారా కనిపెట్టినట్లు తెలుస్తోంది. వెంటనే అర్బన్ సీఐ నరేష్‌బాబు, వారి సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిసింది. గతంలో మైలవరం మండలం తలమంచిపట్నం పోలీసుస్టేషన్ లిమిట్స్‌లోనూ వీరు పట్టుబడినట్లు తెలుస్తోంది. అలాగే మరికొందరు గండికోటలో పేకాట నిర్వహిస్తున్నారని జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు రాబడిన సమాచారం మేరకు వెళ్లి పట్టుకున్నట్లు సమాచారం. గండికోటలో పట్టుబడిన వారు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బయటి ప్రాంతాలకు చెందిన వారని, దాదాపు 22 మంది పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వారి వద్ద నుంచి రూ.11 లక్షలు దాకా డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. గండికోటలో పేకాట స్థావరంపై దాడి చేశారా ? ఎంతమందిని అదుపులోకి తీసుకున్నారు ? డబ్బులు ఎంత స్వాధీనమైంది ? అనే విషయాన్ని జమ్మలమడుగు 'ఆంధ్రజ్యోతి' విలేకరి అర్బన్ సీఐ నరేష్‌బాబుకు ఆదివారం రాత్రి మూడుసార్లు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. సోమవారం సాయంత్రం వరకు సమాచారం ఇవ్వలేదు. ఇదిలా ఉండగా, పారిపోయిన వారిని పట్టుకునే దాకా కేసు వివరాలు చెప్పనట్లు తెలుస్తోంది.

బస్టాప్ స్థలంపై పట్టా ఇవ్వొద్దని ఫిర్యాదు



పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ కళ్యాణికి అర్జీలు అందిస్తున్న ప్రజలు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీలోని ఐదు గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతున్న బస్టాప్ స్థలాన్ని రెవెన్యూ అధికారులు వేరొకరి పేరుతో పట్టా ఇచ్చేందుకు చర్యలు చేస్తున్నారని ఐదు గ్రామాల ప్రజలు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పదేళ్ల నుంచి రోడ్డు పక్కన ఉన్న స్థలాన్ని తాము బస్టాప్‌గా ఉపయోగించుకుంటున్నామని, ఆ స్థలాన్ని వేరొకరికి పట్టా ఇస్తే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. తంబళ్లపల్లె మండలంలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన దబ్బలగుట్ట ప్రాజెక్టు ముంపునకు గురైన తమ భూములకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని విన్నవించారు. సబ్‌కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని పునుగుపల్లె వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉన్న 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో మాదిరి లోఓల్టేజీ, ఓవర్‌లోడ్ తద్వారా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈలు చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్, మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఏఈలు రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, రఫీ, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో 26 రేషన్ దుకాణాలపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వెంకటరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. అర్గనైజేషన్ లేకపోవడంతో 6ఏ కేసులు నమోదు చేశామని వాళ్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర, అంగన్వాడీలకు సంబంధించిన పామాయిల్, కందిపప్పు, సన్నబియ్యంతో వ్యత్యాసాలు ఉన్నాయని వారు తెలిపారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూ ఎస్. లక్ష్మీపతి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఆవిష్కరించారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రాయచోటిలోని శ్రీశివ నర్సింగ్ కళాశాలలో 10వ తేది ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున తెలిపారు. ఈ మేళాలో యాక్సిస్‌బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, శ్రీషిరిడీసాయి ఎలక్ట్రికల్, కొమెట్ స్టాఫ్ సొల్యూషన్, ఎన్‌టెక్స్ ట్రాన్స్‌ఫర్సనెన్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ కోసం ఎన్‌ఏఐపీయూఎన్‌వైఏయం. ఏపీ.జీవోవీ. ఇన్ వివరాలకు 9550104260 నెంబరును సంప్రదించాలన్నారు.

మిర్చి దిగుబడి భళా...ధర అదుర్స్

● ఎకరాకు రూ.లక్షా 30వేలు ఆదాయం

రాజుపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వర్షాకాలం పంట కింద సాగు చేసిన మిర్చి పంట అన్నదాతలకు సిరులు కురిపిస్తోంది ఆశించిన దిగుబడులతో పాటు మార్కెట్లో మంచి ధరలు పలుకు తుండంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజుపాలెం మండలంలోని కొట్టాల, టంగుటూరు గ్రామాల్లో బోర్ల కింద దాదాపు వంద ఎకరాలు పైబడి ఈ పంట సాగులో ఉంది. క్రిష్ణ-604 అనేక రకం, జెర్సీ-56 అనే రకాన్ని రైతులు సాగు చేశారు.

సస్య రక్షణ చర్యలతో మంచి దిగుబడి

ఒక ఎకరా మిర్చిపంట సాగు చేసేందుకు రూ.20వేల చొప్పున మొక్క లు, ఎరువులు, సేద్యం ఖర్చులు కలిపి లక్ష రూపాయలు ఖర్చు వస్తుం దని రైతులు చెబుతున్నారు. మొక్కదశలోనే సస్యరక్షణ చేపట్ట డంతో పాటు ప్రకృతి అనుకూలించడం, వర్షాలు సకాలంలో పడడంతో మొక్క ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తోందని తెలిపారు. క్రిష్ణ 604 అనే రకం కేజీ రూ.34ధర పలుకుతుండడంతో ఇప్పటికే రెండు కోతలకు ఒక ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు.

మంచి ఆదాయం వచ్చింది



ఇతను వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. తన తండ్రి సాయంతో ఆరు ఎకరాలలో మిర్చి పంట సాగచేశారు. వ్యవసాయాధికారుల సూచనలు, తోటి రైతుల సలహాలతో పాటు ఏఐ టెక్నాలజీతో సస్య రక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడి సాధించారు. ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో ఇప్పటికే రూ.13లక్షలు రాబడి వచ్చింది. దీంతో 8 లక్షలు ఖర్చు పోయినా రూ.5లక్షలు మిగిలిందని.. ఇంకా రెండు మూడు కోతలు తెగుతాయని.. మరింత ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

-గొంగటి శ్రీనివాసులరెడ్డి, రైతు



విరగ్గాసిన మిరప కాయలు

మార్కెట్లో మంచి గిరాకీ

క్రిష్ణ 604 అనే రకం సన్నగా ఉండడంతో పాటు 10 నుంచి 15రోజులు నిల్వ ఉంటుంది. దీంతో బయట మార్కెట్‌కు తరలించి మంచి ఆదాయం పొందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అదే విధంగా జెర్సీ 56 అనే రకం మంచి దిగుబడి వస్తోందని.. లోకల్ మార్కెట్‌లో కిలో రూ.26 నుంచి రూ.29 పలుకుతోందన్నారు. ఏది మిర్చి పంట సాగు చేసిన రైతులు మంచి లాభాలు వస్తుండడంతో ఆనందంలో ఉన్నారు.

పశువులను వధించే నేరగాళ్ల అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా పశువు లను వధిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కడప మున్సిపల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సారకుక్కల నగేశ్, రామనపల్లెకు చెందిన నేలటూరు చంటి ఇరువురు చిన్నచౌకు ప్రాంతంలో తిరుగుతూ ఆవు ఇతర పశువులను వధిస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గత జూన్ 12న రాత్రి శంకరాపురానికి చెందిన చంద్రశేఖర్ ఆవును మేత కోసం వదలిపెట్టారు. అయితే ఆవు వెనుక భాగం సగం కట్ చేయడంతో ఆ పశువు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాధితుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఈనెల 6న ఒక బర్రెను దేవుని కడప ప్రాంతంలో చంపి దాని అవయవాలను కోయడానికి ప్రయత్ని స్తుండడంతో ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. కొంతమంది పశువు లను వధిస్తున్నారని.. దీనిపై ప్రజల్లో అనుమానాలు కలిగి మత విధ్వంసాలకు దారి తీసే అవకాశం ఉందని... పూర్తిస్థాయిలో నిజానిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నింది తుల వద్ద నుంచి కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ఏటీఎం పిన్ జనరేటింగ్ పేరుతో మోసగింపు

ముద్దనూరు సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏటీఎం కార్డు పిన్ జనరేటింగ్ పేరుతో షేక్ బాబాఫక్రుద్దీన్ అనే వ్యక్తిని గు ర్తుతెలియని వ్యక్తి సోమవారం ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో మోసగించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మండల పరిధిలోని యామవరం గ్రామానికి చెందిన షేక్ బాబాఫక్రుద్దీన్ భార్య త స్లీం పేరు మీద కొత్త ఏటీఎం కార్డు వచ్చింది. పిన్ జనరేటింగ్ కోసం ఎస్‌బీఐ ప్రాంగణంలో ఏటీఎం వద్దకు వచ్చాడు. ఏటీఎం కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి పిన్ జనరేటింగ్ చేయిస్తానని నమ్మబలికాడు. దీంతో ఏటీఎం కార్డు తీసుకొని పిన్ జనరేటిం గ్ చేశాడు. తిరిగి ఇచ్చే తరుణంలో వేరే ఏటీఎం కార్డు ఇచ్చా డు. తరువాత కొద్ది సేపటికి అకౌంట్‌లోని రూ.30వేలు డెబిట్ అయ్యింది. దీంతో గుర్తుతెలియని వ్యక్తి మోసగించాడని తెలు సుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు సీఐ తెలిపారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దు టూరు పట్టణంలోని భాక రాపేట ఏరియా నుంచి మైదుకూరుకు అక్రమం గా తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను సోమ వారం త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 40 బస్తాల మేర రేషన్ బియ్యం బొలేరో వాహనంలో మైదుకూరుకు తరలిస్తు న్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పెన్నా నదిలో ఒకరి గల్లంతు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తి సమీపం లోని పెన్నానదిలో సోమవారం సాయంత్రం ఒకరు గల్లంతైన ట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిసిన వివరాల మేరకు ప్రొద్దుటూరుకు చెందిన ఫయాజ్ మరో ముగ్గురితో కలిసి పెన్నానది వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లారు. అందులో ఇద్దరు మద్యం తాగుతుండగా ఇద్దరు చేపలు పడుతున్నారు. అయితే ఫయాజ్ ఈత కొట్టేందుకు నదిలోకి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కనిపించకుండా పోయాడు. తోటివారు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపో యింది. రెస్క్యూ టీం రంగంలోకి దిగింది. రాత్రి కావడంతో గల్లంతైన ఫయాజ్ ఆచూకీ లభించలేదని తెలిపారు.

సోలార్ కంపెనీలో కేబుల్ వైరు చోరీ

కొండాపురం, సెప్టెంబరు 8: మండలంలోని టి.కోడూరు వద్ద సోలార్ పనులు చేపడుతున్న సెయిల్ కంపెనీలో కేబుల్ వైరు చోరీకి గురయింది. రెండు, మూడు రోజుల కిందట సుమారు రూ.3లక్షలు విలువ చేసే కేబుల్ వైరు చోరీకి గురయినట్లు సెయిల్ కంపెనీ ప్రతినిధులు సోమవారం పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొ ద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల జువారి సిమెంటు ఫ్యాక్టరీ వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమ వారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.42వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సాధనకారి రంతు



బద్వేలుటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండ లం చింతలపల్లె గ్రామానికి చెందిన మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సాధనకారి రంతును ఏపీరోడ్డు డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సోమ వారం ఉత్తర్వులు అందాయి. తాను చేసిన సేవలను టీడీపీ ప్రభుత్వం గుర్తించి ఏపీ రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిందని రంతు తెలిపారు. ప్రత్యేక ప్రణాళికతో కృషిచేసి ఈ పదవికి వన్నెతెస్తానన్నారు.

ఘనంగా ప్రారంభమైన వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు కడపలో ఘనం గా ప్రారంభమయ్యాయి. జాతీయ సమావేశాల సందర్భంగా సోమ వారం కడప నగరంలో హరితహోటల్ నుంచి ర్యాలీ, కోటిరెడ్డి సర్కి ల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పాత బస్టాండ్‌లో బహిరంగ సభ జరి గింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా అఖిలభారత రైతు వ్యవ సాయ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు విజుకృష్ణన్, విజయ రాఘవన్, శివదాసన్, వెంకట్ తదితరులు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కృష్ణన్ మాట్లాడుతూ నేడు నూతన ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగం మొత్తం దివాలా తీస్తుందని వ్యవసాయ కార్మి కులు పెద్దఎత్తున వలస బాట పడుతున్నారన్నారు. సన్న, చిన్నకారు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఇవి ఏమాత్రం పట్టడం లేదని వారు ధ్వజమెత్తారు. వ్యవసాయ కూలీలను వలసలు నివారణ కోసం ఆనాడు వామపక్ష పార్టీల ఎంపీలు పెద్దఎత్తున పోరాడి సాధించు కున్న ఉపాధి హామీ పథకాన్ని నేడు బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా తూట్లు పొడుస్తున్నదన్నారు. పండించిన పంటలు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కేరళ తరహా ప్రత్యామ్నయ విధానాలు భారతదేశ రైతులకు వ్యవసా య కార్మికులకు కావాలని వారు తెలిపారు. ఏపీలో కూటమి ప్రభు త్వం కేంద్రంలోని బీజేపీ కేంద్ర నిధులకు ఆశపడి రాష్ట్రానికి రావా ల్సిన ఎరువులు యూరియా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘా ల నాయకులు చంద్రన్, విక్రమ్‌సింగ్, లలితబాలన్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దండాల సుబ్బారావు, సీపీఎం, సీఐటీయూ, విద్యార్థి యువజన సంఘాల నాయకులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి...కలెక్టర్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు రైతులు తప్పని సరిగా వేయించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యా లయంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు ఈ టీకాల కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,71,400 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయ న్నారు. నాలుగు నెలలు దాటిన నల్ల, తెల్ల పశువులకు రైతులు గాలి కుంటు నివారణకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శారదమ్మ, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు



స్కూల్‌గేమ్స్ షెడ్యూల్ విడుదల చేస్తున్న ఏడీ రామకృష్ణ

కడప స్పోర్ట్స్ సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపికల ప్రక్రియను ఈనెల 10వ తేదీ బుధవారం నుంచి వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఎం.శ్రీకాంత్‌రెడ్డి, వి.చంద్రావతి వెల్లడించారు. సోమవారం జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో సంబంధిత ఏడీ రామకృష్ణ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్‌ను అనుసరించి జిల్లాలోని వ్యాయా మ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో క్రీడలలో రాణించే క్రీడాకారులను ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్య దర్శి ఎం.ప్రవీణ్‌కిరణ్ పాల్గొన్నారు.

వైవీయూ లలిత కళా విభాగం స్కాలర్ సుజాతకు స్పెయిన్ దేశ ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాల యం లలిత కళావిభాగం రీసర్చ్ స్కాలర్ ఇ.సుజా తకు 2026 మే నెలలో స్పెయిన్‌లో జరగనున్న అంతర్జాతీయ సెమినార్‌కు ఆహ్వానం అందింది. సదస్సు నిర్వాహకులు ఫెర్నాం డెజ్ ఇ-మెయిల్ ద్వారా ఆమెను ఆహ్వానించారు. ఈ పర్యటనకు అయ్యే ప్రయాణ, వసతి, వీసా ఖర్చులు నిర్వాహకులు భరిస్తారని తెలిపారు. ప్రస్తుతం సుజాత, లలిత కళాశాఖ విభా గాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మార్గదర్శకత్వంలో విజయ నగర పెయింటింగ్స్ మీద పరిశోధన చేస్తున్నారు. పరిశోధనలో భాగంగా తిరుపరట్టికుండ్రం ఆలయంలోని ఉన్న జైన్ కుడ్య చిత్రాలపై రీసెర్చ్ గైడ్‌తో సంయుక్తంగా ప్రచురించిన పేపర్ ఆధారంగా నిర్వాహకులు సుజాతని ఆ సదస్సులో ప్రారంభ సమావేశంలో ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించారని మృత్యుంజయరావు తెలిపారు. సుజాత ఎంపిక పట్ల యూని వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, అధ్యా పకులు హర్షం వ్యక్తం చేశారు.

యూఎస్ఏ జర్నల్‌కు ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా డాక్టర్ సుధాకర్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ బుసిరెడ్డి సుధా కర్‌రెడ్డికి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) సైన్స్ పబ్లిషింగ్ గ్రూప్ నిర్వహిస్తున్న జర్నల్ ఆఫ్ ఫొటోనిక్ మెటీ రియల్స్ అండ్ టెక్నాలజీకి ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్-ఇండెక్స్, ఏడీ ఇండెక్స్ ర్యాంకింగ్, సైమాగో జర్నల్ ర్యాంకింగ్ (ఎస్‌జేఆర్), ఏఎస్సీఐ, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్, థామ్సన్ రాయిటర్స్ ఇంపాక్ట్ ఫ్యాక్టర్ జర్నల్స్ మరియు శక్తినిల్వ, డబ్ల్యూఎల్ఈడీలు, లేజర్లు క్వాంటం కంప్యూటింగ్‌లలో పరిశోధనలను నిర్వహించడానికి యూజీసీ, సీఎస్ఐఆర్ ఆర్‌యుఎస్ఏ నిధులు సమకూర్చిన ఆరు పరిశోధన ప్రాజెక్టుల ఆధారంగా కమిటీ ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమిం చిందన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్ర నాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వెంకటసుబ్బయ్య, బోధనా సిబ్బంది డాక్టర్ సుధాకర్ రెడ్డిని అభినందించారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల అమరావ తిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ చదు వుతున్న విద్యార్థులు నాగపవన్, అరవింద్, విజయ్‌కుమార్, రవితేజలు సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 11,14 తేదీల్లో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే ఈ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆకాంక్షిం చారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

దువ్వూరులో క్లినిక్ ల్యాబ్ సీజ్



బోర్డును తొలగిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

దువ్వూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో సోమ వారం అనుమతి లేకుండా నిర్వ హిస్తున్న క్లినిక్ ల్యాబ్‌ను గుర్తిం చి సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఆయన ఇ క్కడకు వచ్చినట్లు చెప్పారు. మండలంలో అనుమతులు లే కుండా ప్రైవేటు ఆస్పత్రులు, క్లీ నిక్ ల్యాబ్‌లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామ హెచ్చరించారు. ఆయ న వెంట స్థానిక మెడికల్ ఆఫీసర్లు సురేష్‌బాబు, హేమలత, ఎంపీహెచ్‌ఈ వో రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో సోమవారం చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో అనంతపురం జట్టుపై గెలుపు సాధించింది. మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు కడప జట్టుపై ఇన్నింగ్స్ 69 పరుగుల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. వివరాలిలా.... ఏసీఏ క్రికెట్ స్టేడి యంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగు తున్న మ్యాచ్‌లో తొలుత అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. చిత్తూరు జట్టు మొదటి రోజు 33 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. రెండవ రోజైన సోమవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి 55.3 ఓవ ర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో తేజారెడ్డి 106 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టు 31 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించి ంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 46.2 ఓవర్లలో 142 పరుగు లకు ఆలౌట్ అయిం ది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు బౌలర్ అచ్యు తానంద 5 వికెట్లు సాధించారు. దీంతో 111 పరుగుల స్వల్ప స్కోర్ ను ఛేదించే క్రమం లో చిత్తూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి 14.5 ఓవర్లలో రెండు వికె ట్లు మాత్రమే కోల్పోయి 113 పరుగులు సాధించి గెలుపొందింది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న క్రికెట్‌మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నిం గ్స్‌లో 43.5 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలి సిందే. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 35.5 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 140 పరుగు లు చేసింది. తిరిగి రెండో రోజు బ్యాటింగ్‌కు దిగి 86.1 ఓవర్లలలో 501 పరుగుల భారీ స్కోర్ వద్ద ఆలౌట్ అయింది. ఇందులో కారు ణ్యప్రసాద్ 167 పరుగులు సాధించి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో నెల్లూరు జట్టుకు 244 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బరిలోకి దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 33.1 ఓవర్లలో 175 పరుగులకే చేతు లెత్తేసింది. కాగా బౌలింగ్ విభాగంలో నెల్లూరు జట్టు బౌలర్ అఖిల్ సాలుం 5 వికెట్లు పడగొట్టి జట్టు గెలుపునకు బాటలు వేశా రు. దీంతో ఇన్నింగ్స్ 69 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయకేతనం ఎగురవేసింది.



అచ్యుతానంద (చిత్తూరు), తేజారెడ్డి (చిత్తూరు), అఖిల్ సాలంకె (నెల్లూరు), కారుణ్యప్రసాద్ (నెల్లూరు)

బొప్పాయి ధరలపై ఫిర్యాదులకు హెల్ప్‌లైన్ నంబర్లు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలపై రైతులు పిర్యాదులు చేసేందుకు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసినట్లు రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కిలో బొప్పాయి ధర రూ. 8 కంటే తక్కువగా ఉంటే రైతులు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు 95739 90331, 9030315951లకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. తప్పుడు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ బదిలీ

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కడపకు బదిలీ అయ్యారు. ఈయన నాలుగు నెలల క్రితం నంద్యాల నుంచి రాయచోటికి వచ్చారు. ఆరు నెలలు కూడా గడవముందే కడపకు బదిలీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతానికి సీనియర్ అసిస్టెంట్ సునీల్‌బాబుకు ఇన్‌చార్జి ఇచ్చినట్లు తెలిసింది. కొత్త సబ్ రిజిస్ట్రార్ ఎవరన్నది ఇంకా తెలియలేదు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జి ఏఈగా దివ్య

ఒంటిమిట్ట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట మండల ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జి ఏఈగా దివ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తులసిరెడ్డి సెలవుపై వెళ్లడంతో కడప డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న దివ్యను ఒంటిమిట్ట ఇన్‌చార్జిగా నియమితులయ్యారు.

విద్యార్థి నేతకు సేవా రత్న అవార్డు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి రాయలసీమ జోనల్ అధ్యక్షుడు మల్లెం హేమంత్ ఆదివారం కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి సేవా రత్న అవార్డును అందుకున్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది మదిరే రంగసాయిరెడ్డి అవార్డును అందజేసినట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలతోపాటు ప్రజాక్షేత్రంలో సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు, ఆపదలో ఉన్న వారికి సాయం అందించినందుకు ఈ అవార్డు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు సుదర్శన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చక్రంపేట ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ సుదర్శన్‌కు ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ప్రదానం చేయడంతో సోమవారం ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఆయనను సత్కరించింది. ఈ సందర్భంగా విద్యారంగానికి ఆయన అందించిన సేవలను పలువురు ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.హరిప్రసాద్, అన్వర్ బాషా, పీఎస్ఎల్వీ ప్రసాద్, కృష్ణకుమారి, ప్రమీల, మహేంద్ర, శ్రీవాణి, సుదర్శన్, సతీష్‌బాబు, దేవమణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల అందజేత

చిట్వేలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏఈవోగా నల్లప్ప వర్ధంతి సందర్భంగా ఆయన భార్య లక్ష్మీదేవి, కుమారులు మూర్తి, చంద్రశేఖర్, కుమార్తె రమాదేవి రాపూరు ప్రధాన రహదారిలోని తిమ్మయపాలెం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న దత్తగిరి నారాయణ తపోవన ఆశ్రమంలోని వృద్ధులకు సోమవారం బియ్యం, పండ్లు, కూరగాయలు, ధూపదీపనైవేద్య సామగ్రి అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య, నాగలక్షుమ్మ, పద్మావతమ్మ, కార్యనిర్వాహకులు చంద్రశేఖర్, మిత్రులు ఆత్మారెడ్డి, కోటి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధికంగా వాడితే అనర్థాలు

● డ్వామా పీడీ వెంకటరత్నం

గాలివీడు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): యూరియా అధికంగా వినియోగిస్తే అనర్థాలు తప్పవని డ్వామా పీడీ వెంకటరత్నం రైతులకు సూచించారు. సోమవారం తహసీల్దార్ భాగ్యలతతో కలిసి విచక్షణా రహితంగా యూరియా వాడకం వలన కలిగే నష్టాలపై గాలివీడు మండలంలోని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అధిక మోతాదులో వాడితే చీడపీడల ఉధృతి పెరగడం, భూసారం క్రమంగా తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా తక్కువ ఖర్చుతో భూసారాన్ని కాపాడటంతో పాటు ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్, ఎంఏవో, వీఏఏలు పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

అపోహలు నమ్మకండి

లక్కిరెడ్డిపల్లె: యూరియాపై అపోహలు నమ్మవద్దని , కావాల్సినంత యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారి రాజకుమారి తెలిపారు. సోమవారం కోనంపేట, టీ. యర్రగుడి గ్రామాల్లో యూరియాపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని యూరియాను తగు మోతాదులో పంటకు అనుకూలంగా ఉపయోగించుకోవాలని, యూరియాతో పాటు, నానో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఏప్రిల్ నెలలో పచ్చిరొట్ట ఎరువులు, జనుములు, నవధాన్యాలు సాగు చేసి, కోత దశలో కలియ దున్నితే 25 శాతం నత్రజని లభిస్తుందన్నారు. వరిసాగు చేసే రైతులకు ఎకరానికి 110 కేజీల యూరియా అవసరమవుతుందని, ఇందులో సగం పిలక దశలో, మిగిలిన సగభాగం పొట్ట దశలో వేయాలన్నారు. యూరియా అధికంగా వాడితే పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుందన్నారు. దీంతో పురుగు మందులు, తెగుళ్ల మందులు ఎక్కువగా వాడాల్సి వస్తుందన్నారు. కాబట్టి తగినంత యూరియాను పంటకు వాడాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామాపురం : ఎరువుల సక్రమ వినియోగంతోనే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధ్యమని మండల ప్రత్యేక అధికారి పీడీ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి, సరస్వతిపల్లి గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ఘనజీవామృతంతో ప్రయోజనాలను వివరించారు. లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, రెండు గ్రామాల రైతు సేవా కేంద్రం వీఏఏలు మన్సూర్, సాయి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

చిన్నమండెం : మండలంలోని వండాడి కొత్తపల్లి ఆర్ఎస్కేల్లో నానో, జీవన ఎరువులపై రైతులతో మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎంపీడీవో, ఏవో గీతల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ మండలాధికారి రాంభూపాల్‌రెడ్డి, మండల వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండల ప్రత్యేక అధికారి పవన్‌కుమార్‌రెడ్డి, ఏవో సుబ్రమణ్యం, తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు మండల రైతులతో సమావేశమై యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు.

రాయచోటి(నేతాజీ సర్కిల్): యూరియా వాడకంపై రైతులకు అవగాహన అవసరమని రాయచోటి మండల ప్రత్యేక అధికారి నాగభూషణం తెలిపారు. సోమవారం శిబ్యాల రైతు సేవ కేంద్రంలో రైతులతో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, వంశీ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చిట్వేలి: నానో యూరియా, డీఏపీని వినియోగం, పర్యావరణ పరిరక్షణతో అధిక దిగుబడిని పొందవచ్చునని చిట్వేలి వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మండల పరిదిలోని తిమ్మయ్యగారిపల్లె, సి.కందులవారిపల్లె గ్రామాల్లో రైతులకు నానో జీవన ఎరువులు ప్రకృతి వ్యవసాయంలో పీడీఎంఎస్ కిట్స్ గురించి అవగాహన కల్పించారు. తహసీల్దారు స్పందన ఎంపీడీవో శ్రీనివాసులు, ఉద్యానవన అధికారి ఆయేషా, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది, ఆర్ఎస్కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుల్లంపేట: రెడ్డిపల్లె అయ్యప్పరాజుపేట గ్రామ పంచాయతిలో యూరియా వినియోగంపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ పద్దతిలో వ్యవసాయం చేయాలని ఎంపీడీవో జయంతి సూచించారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని తహసీల్దారు పుల్లారెడ్డి తెలిపారు.

స్త్రీశక్తి పథకం అమలుతో మహిళల్లో ఆనందం

● డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ ఎన్జీవో హోం మీటింగ్ హాల్‌లో స్త్రీశక్తి విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని మహిళలు అందరికీ స్త్రీశక్తి పథకం ద్వారా నాలుగు రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికి మాత్రమే దక్కిందన్నారు.



విజయోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

స్త్రీశక్తి పథకం అమలు కోసం ముఖ్యమంత్రితో కలిసి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. దాని ఫలితంగానే నేడు రాష్ట్రంలోని మహిళలు అందరూ ఉచితంగా బస్సు ప్రయాణాలు కొనసాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా మండిపల్లి కుటుంబం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని, పేద ప్రజలకు సేవ చేయడానికి మండిపల్లి కుటుంబం వారికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని, పేద ప్రజలకు సేవ చేయడానికి మండిపల్లి కుటుంబం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని, మండిపల్లి కుటుంబాన్ని ఆదరిస్తున్న మీ అందరికీ రుణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మహిళలు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'అక్షరాంధ్ర' ర్యాలీ



విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో రవీంద్రనాయక్

సుండుపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా చదువు ఊరందరికీ వెలుగునిస్తుందని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తి సమాజంలో రాణించగలరని, చదువు లేని వ్యక్తులు ఏ విధంగా కష్టాలు ఎదుర్కొంటారో నిత్యం సమాజంలో చూస్తున్నామన్నారు. ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, ఏటీయం శ్రీనివాసులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని దళవాయిపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతి అందజేశారు.

మురుగు నిల్వలు తొలగించాలి



గ్రామ వీధులను పరిశీలిస్తున్న మైథిలి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూడాలని డీఎల్డీవో మైథిలి సూచించారు. సోమవారం మండలంలోని నరవకాటిపల్లె అరుంధతివాడను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని వీధుల్లో నిలచిన మురుగు నీటిని తొలగించాలన్నారు. అనంతరం చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో సుజాతమ్మ, పంచాయతి కార్యదర్శి చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



వృద్ధురాలి సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ భావన

రాజంపేట టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యలను విన్నవించుకునేందుకు రాజంపేట డివిజన్‌లోని పలు మండలాల నుంచి పలువురు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. వారి పిర్యాదులను సబ్ కలెక్టర్ భావన పరిశీలించారు. ఆయా అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంబది తదిరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

వీరబల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్లి బత్తనవారిపల్లెలో సర్పంచ్ నాగార్జునాచారి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో తాగునీటి పథకం మోటారు కాలి పోవడంతో తాగునీరు సరఫరా కావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన సోమవారం మోటారు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని ఏ గ్రామంలో నీటి సమస్య ఉందని తెలిపినా తక్షణమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ పనులు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో పట్టణంలోని వడ్డేపల్లికి చెందిన జమలపాటి లలిత అనే కార్మికురాలు తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో వెన్నెముక దెబ్బతినడంతో మూడు నెలలుగా మంచానికి పరిమితమై ఆదివారం మృతి చెందింది. సోమవారం భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు బత్తుల విజయకుమార్, కోశాధికారి చెంగల్ రాయలు ఆమె ఇంటికి వెళ్లి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

రోడ్డుపైనే మురుగు.. పట్టించుకోని అధికారులు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రాయచోటి, నేతాజీ సర్కిల్ , సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని జగదాంబ సెంటర్ రోడు, వీఆర్ స్కూల్ వీధి సమీపంలో రోడ్డుపై మురుగు పారుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో చాలా రోజులుగా మురుగు పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మురుగు కాలువలు చెత్తా చెదారంతో నిండిపోవడంతో ఈ సమస్య తలెత్తుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల కారణంగా రోడ్డు దెబ్బ తినడంతో పాటు, దోమలు పెరిగిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాల్సి ఉంది

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సిద్దవటం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల ద్వారా సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందడంతో మండలంలోని మాధవరం-1 ఎస్టీ కాలనీ, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో సోమవారం పారిశుధ్య చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం మార్పుల వల్ల ఎస్టీ కాలనీ, వెంకటేశ్వరపురం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకడంతో ఆయా ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో పూడిక తీయించడంతోపాటు, ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్, అబేట్ చల్లించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవరం ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



చమర్తి జగన్‌మోహన్‌రాజును సత్కరిస్తున్న జనసైనికులు

నందలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజును ఉమ్మడి కడపజిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబరు, నందలూరు జనసేన నాయకుడు గురివిగారి వాసు కోరారు. సోమవారం నందలూరు జనసేన నాయకులు చమర్తి జగన్‌మోహన్ రాజును కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. హోటల్ శివ, రామకృష్ణ, ఈశ్వర్, సౌమ్యనాథస్వామి చిత్రపటాన్ని ఆయనకు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్ నరసింహ, నందలూరు క్లస్టర్ ఇన్‌చార్జి ప్రవీణ్, జనసైనికులు అరుణ్‌పాండే, శేఖర్, ప్రతాప్, బన్నీ, మణీశ్, మోహన్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



కిరణ్ కుమార్

రాయచోటి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు బొంగాని కిరణ్‌కుమార్‌కు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ బీ. దేవప్రసాద్‌రాజు పర్యవేక్షణలో ఆప్టికల్ అండ్ లుమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ ఇయోడియం, ఇటర్బీయం, నియోడియం, ఎర్బీయం డోప్డ్ ఆక్సీఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ ఫోటోనిక్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన చేశారన్నారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌కు కళాశాల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

సిద్దవటం మండలానికి 20 టన్నుల యూరియా

సిద్దవటం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలానికి 20 టన్నుల యూరియా మంజూరైందని మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. జ్యోతి రైతుసేవా కేంద్రానికి 6,975 మెట్రిక్ టన్నులు, వంతాటిపల్లె రైతుసేవా కేంద్రానికి 6,975 మెట్రిక్ టన్నులు, మాచుపల్లె రైతుసేవా కేంద్రానికి 6,975 మెట్రిక్ టన్నుల యూరియా అందు బాటులో ఉందని రైతులు భూమి పత్రాలు తీసుకొని రైతుసేవా కేంద్రానికి వెళ్లి యూరియా తీసుకోవాలని తెలిపారు. రైతులకు యూరియా కొరత లేకుండా అందజేస్తున్నామని, అవసరమైన వారు సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



జ్యోతి రైతుసేవా కేంద్రంలో యూరియా దించుతున్న కూలీలు

సిద్దవటం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అన్యాక్రాంతమైన తన స్థలాన్ని తనకు ఇప్పించాలని మాధవరం గ్రామానికి చెందిన సుజాత అనే మహిళ తహసీల్దారుకు విన్నవించింది. సిద్దవటం మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం అందజేసింది. మాధవరం-1 గ్రామంలోని పెద్దపల్లి రెవెన్యూ సర్వేనంబరు 892/3లో తన పేరుతో ఉన్న 2 సెంట్ల స్థలంపై అదే గ్రామానికి చెందిన గంగిరెడ్డి అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించాడని ఆరోపించింది. తన పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరింది. ఈ విషయంపై తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ తన స్థలంలో గోడ నిర్మిస్తుండగా గంగిరెడ్డి అనేవ్యక్తి అడ్డు తగులుతున్నాడని సుజాత అనే మహిళ ఫిర్యాదు చేసిందని, రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మలేరియా అధికారి జయరామయ్య

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరామయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో ఆరు ప్రాథమిక కేంద్రాల పనిధిలో పనిచేస్తున్న సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పురుష ఆరోగ్య కార్యకర్తలు ప్రతిరోజు తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించి లార్వా, జ్వరాల సర్వే చేయాలన్నారు. జ్వరం కేసులను గుర్తించి రక్తనమూనాలను సేకరించి రోగి పరిస్థితి బట్టి చికిత్స అందించాలన్నారు. గ్రామాల్లోని పైపుల లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత, పారిశుధ్య వాతావరణం ఉంటే వాటిని వెంటనే పంచాయతీ అధికారి ద్వారా శుభ్రం చేయించాలన్నారు. అంటువ్యాధుల నియంత్రణపై 104 సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రతి గ్రామంలో పాఠశాలలోనూ జన జమూహం ఉన్న చోట ఏర్పాటు చేసి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, అతిసార డీసెంట్రీ, కామెర్లపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

చిన్నమండెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ప్రజా చైతన్య సేవా సంఘం రాయచోటి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఉర్దూ హై స్కూల్‌లో సోమవారం హెచ్ ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ బాధితులు సమాజంలో కలిసి జీవించాలి. కండోమ్ ఉపయోగం , హెచ్ఐవీ,ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, ఏపీఎస్ఏసీఎస్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి వివరించారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించా. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సాంబశివ, టీచర్స్ మహమ్మద్‌రఫీక్, ఖాసీం, పీసీఎస్ఎస్ ప్రాజెక్టుల మేనేజర్ స్వాతి, ఓఆర్‌డబ్ల్యూఈ అలేఖ్య, ఖాదర్‌వలి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

భుజంగేశ్వరుడికి పూజలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం అభిషేకాలు, పూజలు చేశారు. అర్చకులు బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, దూర్జటి యోగీశర్మ భువనేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం




సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మహిళలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపేరూరు పంచాయతీ చిన్న కొత్తపల్లెలో సోమవారం సీసీ రోడ్ల పనులను ప్రారంభించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి నిధులు రూ.5.14 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. గ్రామానికి చెందిన మహిళలతో పనులను ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో గంగలచెరువు ఛైర్మన్ కట్టా వెంకటరమణ, నాయకులు సుబ్బరాయుడు, బి.వెంకటేశ్ మధుసూదన్, శ్రీనివాసులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం...ఆహ్లాదం

- పర్యాటక క్షేత్రంగా మల్లయ్యకొండ
- కొండ పైన వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణం
- మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు

ఆలయం ముందు ఉన్న వ్యూ పాయింట్ నుంచి అడవుల అందాలు



తంబళ్లపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆధ్యాత్మికంతో పాటు పర్యాటక శోభ సంతరించుకుంది. జిల్లాలోనేపేరుగాంచిన పురాతన ఆధ్యాత్మిక శైవ క్షేత్రమైన మల్లయ్యకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో ప్రకృతి అందాల నడుమ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మూడు కొండల మల్లన్నగా పేరొందిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కొలువై ఉన్నాడు. మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. సోమవారం భక్తుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. కార్తీక సోమవారాల్లో వేలాది మంది భక్తులు, మహిళలు కొండకు వచ్చి భక్తిశ్రద్ధలతో గౌరీవ్రత నోములు నోచుకుంటారు. మహిళలు ఉపవాసంతో ఆలయ ధ్వజస్తంభం ముందు కోరిన కోర్కెలు నెరవేరాలని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు మొక్కుకుంటారు. ఏటా మూడు రోజుల పాటు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

కొండ పైన ఆహ్లాదకరమైన వాతావరణం

సముద్రమట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో ఉన్న సాధు, మల్లయ్యకొండ అడవి ప్రకృతి అందాలు ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు మల్లయ్యకొండ మొత్తం పచ్చదనం పరుచుకుంది. కొండపై నుంచి చూస్తే కనిపించే లోయలు, ఎత్తయిన కొండలు, రకరకాల చెట్లు, వన్యప్రాణులు, ఘాట్ మార్గంలోని మలుపులు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. కొండపైన శీతాకాలంలో ఊటీని తలపిస్తూ, వేసవిలో స్వచ్ఛమైన చల్లగాలులను అందిస్తూ, వర్షాకాలంలో అరకు అందాలను మైమరపించే విధంగా కాలానికి తగ్గట్టుగా కొండ పైన వాతావరణ పరిస్థితులు నెలకొని ఉంటాయి.

వాచ్‌టవర్‌తో అడవుల రక్షణ

వాచ్‌టవర్లు పర్యాటకులు అడవులను సందర్శించడానికే కాకుండా అడవుల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయి. వాచ్‌టవర్ పైకి ఎక్కి పరిశీలిస్తే అడవిలో ఎక్కడ ఏం జరుగుతున్నా తెలుసుకోవచ్చు. అటవీ అధికారుల పర్యవేక్షణ పెరిగి చెట్ల నరకివేత, వన్య ప్రాణుల వేట వంటివి ఆగిపోయే అవకాశం ఉంటుంది. వేసవిలో అడవుల్లో మంటలు చెలరేగితే ఆ ప్రాంతాన్ని త్వరగా గుర్తించే వీలుంటుంది. వెంటనే ఆ ప్రాంతాలకు వెళ్లి మంటలను అదుపు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టవచ్చు. భవిష్యత్తులో వాచ్‌టవర్ వద్దకు టోల్‌గేట్ ద్వారా అటవీ శాఖకు ఆదాయం సమకూర్చుకునే అవకాశం కూడా ఉంటుంది. ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. కార్తీక సోమవారం, నూతన సంవత్సరం, మహాశివరాత్రి వంటి ప్రత్యేక రోజుల్లో రాయచోటి, మదనపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండ్యం తదితర పట్టణాల నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు కొండకు తిరుగుతుంటాయి.



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నూతనంగా నిర్మించిన వాచ్‌టవర్


వాచ్‌టవర్, పగోడాలతో ఆహ్లాదం

మల్లయ్యకొండ పైన ఆలయానికి ఉత్తర దిక్కున అర కిలోమీటరు ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడ ఎత్తయిన ప్రదేశంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.45 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఓ వాచ్ టవర్‌తో పాటు రెండు పగోడాలను నిర్మించారు. గౌరమ్మ కుప్ప వద్ద నిర్మించిన వాచ్‌టవర్ నుంచి చూస్తే మల్లయ్య కొండ చుట్టూ కొన్ని వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న దట్టమైన అడవులు, పచ్చని చెట్లు, కొండలు, లోయలను వీక్షించవచ్చు. ఇక్కడి వ్యూ పాయింట్ నుంచి తిరుమల కొండలు కనిపిస్తాయి. దీంతో పాటు వాచ్ టవర్ పక్కనే సందర్శకులు సేద తీరడానికి వీలుగా రెండు పగోడాలను నిర్మించారు. కొండకు వచ్చిన పర్యాటకులు పగోడాల కింద కూర్చుని చల్లటి గాలుల మధ్య ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సేదతీరవచ్చు.



నూతనంగా నిర్మించిన పగోడాలు





వాచ్ టవర్ నుంచి కనిపిస్తున్న ప్రకృతి అందాలు

మల్లయ్యకొండ పైన దర్శించవలసిన ప్రదేశాలు

మల్లయ్యకొండపైన ఆలయానికి ఎగువ వైపున గౌరమ్మ ఆలయం ఉంది. కొండపైన సహజసిద్ధంగా ఏర్పడిన నిచ్చెనకొండ, ఎలుకతీర్థం, భగీరథీ కొలను (కోనేరు), అంతర గంగ, అన్నబేధి అనే పంచ తీర్థాలు ఉన్నాయి. వీటిలో సహజంగా ఊరిన నీటిని స్వామి వారి అర్చనలు, అభిషేకానికి ఉపయోగిస్తారు. స్వామి వారికి అభిషేకించిన నీటిని తీర్థంగా సేవిస్తే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం. నిచ్చెనకొండలో ఉన్న రాతిలో ఎంతటి కరువులో నైనా నీరు ఉండటం దైవ మహిమగా చెప్పుకోవచ్చు. భక్తులు నిచ్చెన ద్వారా నిచ్చెన గుండం ఎక్కి అందులోని నీటిని తీర్థంగా సేవిస్తారు. ఇంకా వీరన్న గెవి, చాకలివాని బావి, ఎర్రబావి (ఊటచలం) తదితర దర్శించవలసిన ప్రదేశాలు కొండపైన ఉన్నాయి.

కోరిన కోర్కెలు తీర్చే మల్లన్న



మల్లయ్యకొండ పైన కూటమి ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మల్లన్న స్వామి కోరిన కోర్కెలు తీరుస్తుండటంతో భక్తుల తాకిడి పెరుగుతోంది. కొండకు వచ్చిన భక్తులు తొలుత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని తర్వాత గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం కొండ పైన వీరన్నగెవి, నిచ్చెనగుండం వంటి చూడదగ్గ ప్రదేశాలను తిలకిస్తూ ఉంటారు. కొండ పైన అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వాచ్‌టవర్, పగోడాలతో పర్యాటకులు పకృతి అందాలను తిలకిస్తూ మధురానుభూతిని పొందుతున్నారు.

-మునిరాజ, మల్లయ్యకొండ ఆలయ ఈవో

మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



మల్లయ్యకొండపైన పర్యాటకుల ఆహ్లాదం కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వాచ్ టవర్, రెండు పగోడాల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీంతో కొండకు వచ్చే పర్యాటకులు మంచి ఆహ్లాదం పొందుతారు. కొండపైన మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాం. కొండపైన ప్లాంటేషన్, ల్యాండ్ స్కేటింగ్, వాకింగ్ పాత్, ఉద్యానవనం పార్కు, వాచ్ టవర్, పగోడాల చుట్టూ హ్యాండ్ డ్రిల్ (స్టీల్ గ్రిల్‌తో రక్షణ గోడ)వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. సీఎస్ఆర్ నిధులు రాగానే అభివృద్ధి పనులు చేపడతాం.

- ఎఫ్ఆర్వో, జయప్రసాదరావు

రణభేరిని జయప్రదం చేయండి: యూటీఎఫ్



రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పీలేరురూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న రణభేరిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పీలేరులో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు. ప్రమోషన్లు, బదిలీ ప్రక్రియ పూర్తై మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా మినిమం టైంస్కేల్ జీతాలు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేయాల్సిన ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లేస్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పనిచేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, మాజీ గౌరవాధ్యక్షుడు రాధాక్రిష్ణ, జిల్లా కౌన్సిలర్ వెంకటరమణ, చిన్నరెడ్డెప్ప, విజయకుమార్, పీరయ్య ఆదినారాయణ, కామేశ్వర తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ద్వారా రూ.4.03 లక్షలను నిరుపేద కుటుంబాలకు అందజేసినట్లు రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఓ వరం అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకున్న కత్తి సుబ్బరాయుడుకు రూ.25,166, రాగినూతల వెంకటరమణకు రూ.20,254, కొప్పర్తి యానాదయ్యకు రూ.23,752, వెంకట సుబ్బయ్యకు రూ.45,798, పెంచలయ్యనాయుడుకు రూ.79,258ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా.. సీఎం సహాయనిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నారని కొనియాడారు.

31 డెంగ్యూ కేసులు నమోదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మలేరియా సబ్ యూనిట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెల వరకు 1,807 మంది రోగులకు డెంగ్యూ వ్యాధి టెస్టులు నిర్వహించినట్లు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి తెలిపారు. ఇందులో 31 మందికి డెంగ్యూ వ్యాధి నిర్ధారణ అయినట్లు ఆర్టీపీసీఆర్ ల్యాబ్ ద్వారా గుర్తించారని, మలేరియా సంబంధించి 3,086మంది వద్ద శ్యాంపిల్ తీసుకున్నట్లు తెలిపారు.


వృద్ధుడిపై పిచ్చికుక్క దాడి

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చిలకుంటలో ఓ పిచ్చి కుక్క వీరంగం చేసింది. అదే గ్రామానికి చెందిన రెడ్డెప్పనాయుడు(70) ఇంటి ముందు కూర్చుని ఉండగా, ఆయనపై దాడి చేసి గాయపరిచింది. వెంటనే స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

మట్టి తరలింపులో బురిడీ

- వ్యవసాయం పేరుతో రియల్ భూములకు
- నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ అనుమతులు

కురబలకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల పేరుతో మట్టి తరలింపునకు అనుమతులు పొంది ఆ మట్టిని రియల్‌ఎస్టేట్ భూములకు తరలిస్తూ ఇరిగేషన్ అధికారులను బురిడీ కొట్టించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'మట్టి మాఫియా బరితెగింపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కాగా మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లె చెరువు, వ్యవసాయ భూములలో మట్టిని తోలుకోవడానికి అనుమతుల కోసం ఇరిగేషన్ అధికారులకు ఈనెల 4న ఒక యువకుడు తమ పొలంలో మట్టిని తోలుకోవడానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే మట్టి తరలింపునకు ఇరిగేషన్ అధికారులు ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు 85 టిప్పర్లు లేదా ట్రాక్టర్‌ల మట్టిని తోలుకోవడానికి అనుమతులు ఇచ్చారు. జాతీయ రహదారి పక్కన ఉన్న భూములకు మట్టిని తరలించుకోవడానికి అనుమతులు కోరిన మరుసటిరోజునే ఎటువంటి విచారణ లేకుండా ఇరిగేషన్ అధికారులు మంజూరు చేయడంలో ఆంతర్యం ఏమిటో అంతుబట్టడం లేదని పలువురు స్థానికులు చెబుతున్నారు. సాధారణంగా ఎవరైనా అనుమతులు కోరిన తక్షణమే మంజూరు చేయడం అసాధ్యం. దీనికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి అనుమతులను మంజూరు చేస్తారు. అయితే కేవలం ఒక్క రోజులోనే అనుమతులు సాధించి రియల్ ఎస్టేట్ భూములకు మట్టిని తరలించుకోవడానికి అనుమతులు పొందారు. కాగా చెరువు నుంచి మట్టిని తరలించడానికి కేవలం అనుమతి పత్రంలో 5 టిప్పర్ల నెంబర్లకు అనుమతులు ఇవ్వగా మట్టిని వేసే జేసీబీ లేదా హిటాచీలను ఇందులో అనుమతులు ఇవ్వకపోవడం విశేషం. ఇవేవీ లేకుండా మట్టిని తరలించడానికి ఎలా సాధ్యమవుతుందో అంతుబట్టడం లేదు. ఈ విషయమై తహసీల్దార్ ధనంజయను వివరణ కోరగా ఇరిగేషన్ అధికారులు మంజూరు చేశారని తెలిపారు. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబును వివరణ కోరగా వ్యవసాయ భూముల అభివృద్ధి పేరుతో జాతీయ రహదారి పక్కనున్న భూములకు మట్టిని తరలిస్తున్నారని పలువురు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని, దీంతో మట్టి తరలింపును నిలిపేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎవరైనా మట్టిని అక్రమంగా తరలిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.



Present Sri G.Suresh Babu, B.Tech., Executive Engineer, Irrigation Division, Madanapalle.

33M Dt. 04/9/2025

Sub: WRD - Minor Irrigation - Irrigation Division, Madanapalle - Lifting of silt from Chintamakulapalle Cheruvu in Sarkarthopu (V) of Kurabalakota (M) in Annamayya District - NOC issued -Regarding.

Ref:- 1. The Government of Andhra Pradesh G.O Ms.No.203, Water Resources (CADA) Department, Dt.12.08.2025.

2. The Representation submitted by Sri P.Rajesh, S/o P.Obulesh, Chintamakulapalle (V), Kurabalakota (M), Annamayya District.

With reference to 1st cited, The Government of Andhra Pradesh had accorded permission to the farmers for excavation and transportation of silt at their own cost for non commercial purpose.

Accordingly with reference to 2nd cited, Sri P.Rajesh, S/o P.Obulesh, Chintham_akulapalle (V) Kurabalakota (M), Annamayya District, has submitted a representation to the under signed for excavation and lifting of silt with survey number 883-1A from Chintamakulapalle Cheruvu to utilize the lifted silt for the Agricultural activities of his owned land with 85 Tippers.

After careful examination of the representation the No Objection Certificate is hereby accorded for lifting of silt of 85 Tippers of silt with the

మట్టి తరలింపునకు ఇరిగేషన్ అధికారులు మంజూరు చేసిన లెటర్

ముగ్గురు ఐసీడీఎస్ సీడీపీవోలకు పెరిగిన 'ప్రెస్టేజీ'

- కుక్కర్ల గోల్‌మాల్ కేసులో ఎట్టకేలకు విముక్తి

కలికిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టులో సంచలనం కలిగించి పదేళ్ల పాటు చర్చనీయాంశంగా కొనసాగి అనేక మలుపులు తిరిగిన ప్రెస్టేజీ ప్రెజర్ కుక్కర్ల కొనుగోలు కేసుకు ఎట్టకేలకు సోమవారంతో తెరపడింది. ఈ కేసులో నిందితులుగా తేలిన వారిలో చివరగా మిగిలిన ముగ్గురు సీడీపీవోలకు విముక్తి కలిగిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2015 జూలై 22న కడప ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన ప్రెజర్ కుక్కర్లలో పెద్ద ఎత్తున నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఒక దినపత్రికలో 'ప్రెస్టేజీ పోయింది' శీర్షికతో ప్రచురించిన వార్త పదేళ్లపాటు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణితో పాటు పలువురు సీడీపీవోలను ముప్పతిప్పలు పెట్టింది. అంగన్‌వాడీలకు ప్రెస్టేజి ప్రెషర్ కుక్కర్లను సరఫరా చేయాల్సి వుండగా తక్కువ కొలతలు కలిగిన నాసిరకం బ్రాండ్లతో కుక్కర్లను సరఫరా చేశారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై పీవో, సీడీపీవోలపై జిల్లా అధికారులు పోలీసు సూపరింటెండ్‌కు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసు నమోదుకు కూడా చర్యలు తీసుకున్నారు. కాలక్రమేణా వివిధ స్థాయిల్లో జరిగిన విచారణల ఫలితంగా క్రిమినల్ కేసులను ఉపసంహరించుకున్నారు. ఆ తరువాత క్రమంలో విచారణలు, సంజాయిషీలు, చివరికి తమకేమీ తెలియదని, ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారానే సరఫరా జరిగాయని, అనంతరం నాసిరకం కుక్కర్లు సరఫరా చేసిన ప్రొద్దుటూరు ఏజెన్సీకి వాటిని తిప్పి పంపి ప్రెస్టేజి బ్రాండెడ్ కుక్కర్లు తెప్పించామని రకరకాలుగా కొంత మంది సీడీపీవోలు మొరపెట్టుకోగా పెన్షన్‌లో ఒక శాతం కోత విధించారు. చివరి వరకూ మిగిలిని ముగ్గురు సీడీపీవోలకు కూడా ఒక శాతం పెన్షన్ కోత నుంచి కూడా ప్రభుత్వం తాజాగా విముక్తి కలిగించింది. ఎట్టకేలకు కడప సీడీపీవో వి.అరుణకుమారి, కమలాపురంలో సీడీపీవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన సి.శ్రీమంతమ్మ, సిద్ధవటం సీడీపీవో పి.భారతిలకు భారీ ఊరట లభించింది. అయితే కడప సీడీపీవో తప్పిదానికి అదనంగా దోషిగా ప్రభుత్వం నిర్ధారించడంతో ఆమెకు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు నిలిచిపోయాయి. వచ్చే ఏడాది 2026 జూన్‌లో పదవీ విరమణ చేయనున్న దృష్ట్యా, తనకు విధించిన 'దోషి' (సెన్స్యూర్) శిక్ష నుంచి తప్పించాల్సిందిగా సీడీపీవో అరుణకుమారి చేసిన వినతులను పరిశీలించిన ప్రభుత్వం చివరికి ఆమెను కూడా నిర్దోషిగా పేర్కొంటూ ఊరట కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి రెండు వేర్వేరు ఆదేశాలు జారీ చేశారు.

గండికోటలో డ్రోన్ కెమెరాలతో పేకాట స్థావరాలపై దాడులు

- పోలీసుల అదుపులో 22 మంది ?
- భారీగా డబ్బులు స్వాధీనం

జమ్మలమడుగు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు తెలుస్తోంది. గతంలో జమ్మలమడుగులోని గండికోట, తదితర గ్రామాల్లో పేకాట, మట్కా బాగా జరిగినట్లు సమాచారం. అయితే నూతనంగా వచ్చిన సీఐ నరేష్‌బాబు ఉన్నట్లుండి జమ్మలమడుగులో ఆదివారం సాయంత్రం మూడు గంటల నుంచి పలు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అయితే పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఆదివారం సాయంత్రం పోలీసు అధికారులు వారి సిబ్బంది భారీగా పేకాట జరుగుతోందని ముందుగానే డ్రోన్ కెమెరాల ద్వారా కనిపెట్టినట్లు తెలుస్తోంది. వెంటనే అర్బన్ సీఐ నరేష్‌బాబు, వారి సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిసింది. గతంలో మైలవరం మండలం తలమంచిపట్నం పోలీసుస్టేషన్ లిమిట్స్‌లోనూ వీరు పట్టుబడినట్లు తెలుస్తోంది. అలాగే మరికొందరు గండికోటలో పేకాట నిర్వహిస్తున్నారని జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు రాబడిన సమాచారం మేరకు వెళ్లి పట్టుకున్నట్లు సమాచారం. గండికోటలో పట్టుబడిన వారు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బయటి ప్రాంతాలకు చెందిన వారని, దాదాపు 22 మంది పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వారి వద్ద నుంచి రూ.11 లక్షలు దాకా డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. గండికోటలో పేకాట స్థావరంపై దాడి చేశారా ? ఎంతమందిని అదుపులోకి తీసుకున్నారు ? డబ్బులు ఎంత స్వాధీనమైంది ? అనే విషయాన్ని జమ్మలమడుగు 'ఆంధ్రజ్యోతి' విలేకరి అర్బన్ సీఐ నరేష్‌బాబుకు ఆదివారం రాత్రి మూడుసార్లు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. సోమవారం సాయంత్రం వరకు సమాచారం ఇవ్వలేదు. ఇదిలా ఉండగా, పారిపోయిన వారిని పట్టుకునే దాకా కేసు వివరాలు చెప్పనట్లు తెలుస్తోంది.

బస్టాప్ స్థలంపై పట్టా ఇవ్వొద్దని ఫిర్యాదు



పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ కళ్యాణికి అర్జీలు అందిస్తున్న ప్రజలు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీలోని ఐదు గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతున్న బస్టాప్ స్థలాన్ని రెవెన్యూ అధికారులు వేరొకరి పేరుతో పట్టా ఇచ్చేందుకు చర్యలు చేస్తున్నారని ఐదు గ్రామాల ప్రజలు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పదేళ్ల నుంచి రోడ్డు పక్కన ఉన్న స్థలాన్ని తాము బస్టాప్‌గా ఉపయోగించుకుంటున్నామని, ఆ స్థలాన్ని వేరొకరికి పట్టా ఇస్తే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. తంబళ్లపల్లె మండలంలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన దబ్బలగుట్ట ప్రాజెక్టు ముంపునకు గురైన తమ భూములకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని విన్నవించారు. సబ్‌కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని పునుగుపల్లె వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉన్న 5ఎంబీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో మాదిరి లోఓల్టేజీ, ఓవర్‌లోడ్ తద్వారా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈలు చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్, మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఏఈలు రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, రవీ, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో 26 రేషన్ దుకాణాలపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వెంకటరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఆర్గనైజేషన్ లేకపోవడంతో 6ఏ కేసులు నమోదు చేశామని వాళ్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర, అంగన్వాడీలకు సంబంధించిన పామాయిల్, కందిపప్పు, సన్నబియ్యంతో వ్యత్యాసాలు ఉన్నాయని వారు తెలిపారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూ ఎస్. లక్ష్మీపతి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఆవిష్కరించారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రాయచోటిలోని శ్రీశివ నర్సింగ్ కళాశాలలో 10వ తేది ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున తెలిపారు. ఈ మేళాలో యాక్సిస్‌బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, శ్రీషిరిడీసాయి ఎలక్ట్రికల్, కొమెట్ స్టాఫ్ సొల్యూషన్, ఎన్‌టెక్స్ ట్రాన్స్‌ఫర్స్‌సెస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ కోసం ఎన్ఏఐపీయూఎన్‌వైఏయం. ఏపీ.జీవోవీ. ఇన్‌వివరాలకు 9550104260 నెంబరును సంప్రదించాలన్నారు.

పశువులను వధించే నేరగాళ్ల అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా పశువు లను వధిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కడప మున్సిపల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సారకుక్కల నగేశ్, రామనసల్లెకు చెందిన నేలటూరు చంటి ఇరువురు చిన్నచౌకు ప్రాంతంలో తిరుగుతూ ఆవు ఇతర పశువులను వధిస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గత జూన్ 12న రాత్రి శంకరాపురానికి చెందిన చంద్రశేఖర్ ఆవును మేత కోసం వదలిపెట్టారు. అయితే ఆవు వెనుక భాగం సగం కట్ చేయడంతో ఆ పశువు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాధితుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఈనెల 6న ఒక బర్రెను దేవుని కడప ప్రాంతంలో చంపి దాని అవయవాలను కోయడానికి ప్రయత్ని స్తుండడంతో ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. కొంతమంది పశువు లను వధిస్తున్నారని.. దీనిపై ప్రజల్లో అనుమానాలు కలిగి మత విధ్వంసాలకు దారి తీసే అవకాశం ఉందని... పూర్తిస్థాయిలో నిజానిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నింది తుల వద్ద నుంచి కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

మిర్చి దిగుబడి భళా...ధర అదుర్స్

● ఎకరాకు రూ.లక్షా 30వేలు ఆదాయం

రాజుపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వర్షాకాలం పంట కింద సాగు చేసిన మిర్చి పంట అన్నదాతలకు సిరులు కురిపిస్తోంది ఆశించిన దిగుబడులతో పాటు మార్కెట్లో మంచి ధరలు పలుకు తుండంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజుపాలెం మండలంలోని కొట్టాల, టంగుటూరు గ్రామాల్లో బోర్ల కింద దాదాపు వంద ఎకరాలు పైబడి ఈ పంట సాగులో ఉంది. క్రిష్ణ-604 అనేక రకం, జెర్సీ-56 అనే రకాన్ని రైతులు సాగు చేశారు.

సస్య రక్షణ చర్యలతో మంచి దిగుబడి

ఒక ఎకరా మిర్చిపంట సాగు చేసేందుకు రూ.20వేల చొప్పున మొక్క లు, ఎరువులు, సేద్యం ఖర్చులు కలిపి లక్ష రూపాయలు ఖర్చు వస్తుం దని రైతులు చెబుతున్నారు. మొక్కదశలోనే సస్యరక్షణ చేపట్ట డంతో పాటు ప్రకృతి అనుకూలించడం, వర్షాలు సకాలంలో పడడంతో మొక్క ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తోందని తెలిపారు. క్రిష్ణ 604 అనే రకం కేజీ రూ.34ధర పలుకుతుండడంతో ఇప్పటికే రెండు కోతలకు ఒక ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు.

మంచి ఆదాయం వచ్చింది

ఇతను వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. తన తండ్రి సాయంతో ఆరు ఎకరాలలో మిర్చి పంట సాగచేశారు. వ్యవసాయాధికారుల సూచనలు, తోటి రైతుల సలహాలతో పాటు ఏఐ టెక్నాలజీతో సస్య రక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడి సాధించారు. ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో ఇప్పటికే రూ.13లక్షలు రాబడి వచ్చింది. దీంతో 8 లక్షలు ఖర్చు పోయినా రూ.5లక్షలు మిగిలిందని.. ఇంకా రెండు మూడు కోతలు తెగుతాయని.. మరింత ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

-గొంగటి శ్రీనివాసులరెడ్డి, రైతు





విరగ్గాసిన మిరప కాయలు

మార్కెట్లో మంచి గిరాకీ

క్రిష్ణ 604 అనే రకం సన్నగా ఉండడంతో పాటు 10 నుంచి 15రోజులు నిల్వ ఉంటుంది. దీంతో బయట మార్కెట్‌కు తరలించి మంచి ఆదాయం పొందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అదే విధంగా జెర్సీ 56 అనే రకం మంచి దిగుబడి వస్తోందని.. లోకల్ మార్కెట్‌లో కిలో రూ.26 నుంచి రూ.29 పలుకుతోందన్నారు. ఏది మిర్చి పంట సాగు చేసిన రైతులు మంచి లాభాలు వస్తుండడంతో ఆనందంలో ఉన్నారు.

ఏటీఎం పిన్ జనరేటింగ్ పేరుతో మోసగింపు

ముద్దనూరు సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏటీఎం కార్డు పిన్ జనరేటింగ్ పేరుతో షేక్ బాబాఫక్రుద్దీన్ అనే వ్యక్తిని గు ర్తుతెలియని వ్యక్తి సోమవారం ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో మోసగించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మండల పరిధిలోని యామవరం గ్రామానికి చెందిన షేక్ బాబాఫక్రుద్దీన్ భార్య త స్లీం పేరు మీద కొత్త ఏటీఎం కార్డు వచ్చింది. పిన్ జనరేటింగ్ కోసం ఎస్‌బీఐ ప్రాంగణంలో ఏటీఎం వద్దకు వచ్చాడు. ఏటీఎం కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి పిన్ జనరేటింగ్ చేయిస్తానని నమ్మబలికాడు. దీంతో ఏటీఎం కార్డు తీసుకొని పిన్ జనరేటిం గ్ చేశాడు. తిరిగి ఇచ్చే తరుణంలో వేరే ఏటీఎం కార్డు ఇచ్చా డు. తరువాత కొద్ది సేపటికి అకౌంట్‌లోని రూ.30వేలు డెబిట్ అయ్యింది. దీంతో గుర్తుతెలియని వ్యక్తి మోసగించాడని తెలు సుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు సీఐ తెలిపారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దు టూరు పట్టణంలోని భాక రాపేట ఏరియా నుంచి మైదుకూరుకు అక్రమం గా తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను సోమ వారం త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 40 బస్తాల మేర రేషన్ బియ్యం బొలేరో వాహనంలో మైదుకూరుకు తరలిస్తు న్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పెన్నా నదిలో ఒకరి గల్లంతు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తి సమీపం లోని పెన్నానదిలో సోమవారం సాయంత్రం ఒకరు గల్లంతైన ట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరుకు చెందిన ఫయాజ్ మరో ముగ్గురితో కలిసి పెన్నానది వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లారు. అందులో ఇద్దరు మద్యం తాగుతుండగా ఇద్దరు చేపలు పడుతున్నారు. అయితే ఫయాజ్ ఈత కొట్టేందుకు నదిలోకి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కనిపించకుండా పోయాడు. తోటివారు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపో యింది. రెస్క్యూ టీం రంగంలోకి దిగింది. రాత్రి కావడంతో గల్లంతైన ఫయాజ్ ఆచూకీ లభించలేదని తెలిపారు.

సోలార్ కంపెనీలో కేబుల్ వైరు చోరీ

కొండాపురం, సెప్టెంబరు 8: మండలంలోని టి.కోడూరు వద్ద సోలార్ పనులు చేపడుతున్న సెయిల్ కంపెనీలో కేబుల్ వైరు చోరీకి గురయింది. రెండు, మూడు రోజుల కిందట సుమారు రూ.3లక్షలు విలువ చేసే కేబుల్ వైరు చోరీకి గురయినట్లు సెయిల్ కంపెనీ ప్రతినిధులు సోమవారం పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొ ద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల జువారి సిమెంటు ఫ్యాక్టరీ వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమ వారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.42వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సాధనకారి రంతు



బద్వేలుటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండ లం చింతలపల్లె గ్రామానికి చెందిన మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సాధనకారి రంతును ఏపీరోడ్డు డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సోమ వారం ఉత్తర్వులు అందాయి. తాను చేసిన సేవలను టీడీపీ ప్రభుత్వం గుర్తించి ఏపీ రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిందని రంతు తెలిపారు. ప్రత్యేక ప్రణాళికతో కృషిచేసి ఈ పదవికి వన్నెతెస్తానన్నారు.

ఘనంగా ప్రారంభమైన వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు కడపలో ఘనం గా ప్రారంభమయ్యాయి. జాతీయ సమావేశాల సందర్భంగా సోమ వారం కడప నగరంలో హరితహోటల్ నుంచి ర్యాలీ, కోటిరెడ్డి సర్కి ల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పాత బస్టాండ్‌లో బహిరంగ సభ జరి గింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా అఖిలభారత రైతు వ్యవ సాయ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు విజుకృష్ణన్, విజయ రాఘవన్, శివదాసన్, వెంకట్ తదితరులు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కృష్ణన్ మాట్లాడుతూ నేడు నూతన ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగం మొత్తం దివాలా తీస్తుందని వ్యవసాయ కార్మి కులు పెద్దఎత్తున వలస బాట పడుతున్నారన్నారు. సన్న, చిన్నకారు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఇవి ఏమాత్రం పట్టడం లేదని వారు ధ్వజమెత్తారు. వ్యవసాయ కూలీలను వలసలు నివారణ కోసం ఆనాడు వామపక్ష పార్టీల ఎంపీలు పెద్దఎత్తున పోరాడి సాధించు కున్న ఉపాధి హామీ పథకాన్ని నేడు బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా తూట్లు పొడుస్తున్నదన్నారు. పండించిన పంటలు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కేరళ తరహా ప్రత్యామ్నాయ విధానాలు భారతదేశ రైతులకు వ్యవసా య కార్మికులకు కావాలని వారు తెలిపారు. ఏపీలో కూటమి ప్రభు త్వం కేంద్రంలోని బీజేపీ కేంద్ర నిధులకు ఆశపడి రాష్ట్రానికి రావా ల్సిన ఎరువులు యూరియా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘా ల నాయకులు చంద్రన్, విక్రమ్‌సింగ్, లలితబాలన్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దండాల సుబ్బారావు, సీపీఎం, సీఐటీయూ, విద్యార్థి యువజన సంఘాల నాయకులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల అమరావ తిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ చదు వుతున్న విద్యార్థులు నాగపవన్, అరవింద్, విజయ్‌కుమార్, రవితేజలు సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 11,14 తేదీల్లో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే ఈ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆకాంక్షిం చారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

రేపటి నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు



స్కూల్‌గేమ్స్ షెడ్యూల్ విడుదల చేస్తున్న ఏడీ రామకృష్ణ

కడప స్పోర్ట్స్ సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపి కల ప్రక్రియను ఈనెల 10వ తేదీ బుధవారం నుంచి వివిధ ప్రాంతా లలో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఎం.శ్రీకాంత్‌రెడ్డి, వి.చంద్రావతి వెల్లడించారు. సోమవారం జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో సంబంధిత ఏడీ రామకృష్ణ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్‌ను అనుసరించి జల్లాలోని వ్యాయామ ఉపాధ్యా యులు తమ పాఠశాలల్లో క్రీడలలో రాణించే క్రీడాకారులను ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రవీ ణ్‌కిరణ్ పాల్గొన్నారు.

వైవీయూ లలిత కళా విభాగం స్కాలర్ సుజాతకు స్పెయిన్ దేశ ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాల యం లలిత కళా విభాగం రీసర్చ్ స్కాలర్ ఇ.సుజా తకు 2026 మే నెలలో స్పెయిన్‌లో జరగనున్న అంత ర్జాతీయ సెమినార్‌కు ఆహ్వానం అందింది. సదస్సు నిర్వాహకులు ఫెర్నాం డెజ్ ఇ-మెయిల్ ద్వారా ఆమెను ఆహ్వానించారు. ఈ పర్యటనకు అయ్యే ప్రయాణ, వసతి, వీసా ఖర్చులు నిర్వాహకులు భరిస్తారని తెలిపారు. ప్రస్తుతం సుజాత, లలిత కళాశాఖ విభా గాధిపతి డాక్టర్ కోట మృత్యుంజ యరావు మార్గదర్శకత్వంలో విజయ నగర పెయింటింగ్స్ మీద పరిశోధన చేస్తున్నారు. పరిశోధనలో భాగంగా తిరు పరట్టికుండ్రం ఆలయంలోని ఉన్న జైన్ కుడ్య చిత్రాలపై రీసెర్చ్ గైడ్‌తో సంయుక్తంగా ప్రచురించిన పేపర్ ఆధా రంగా నిర్వాహకులు సుజాతని ఆ సదస్సులో ప్రారంభ సమావేశంలో ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించారని మృత్యుంజయరావు తెలిపారు. సుజాత ఎంపిక పట్ల యూని వర్సిటీ వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, రిజిస్ట్రార్ పుత్తా పద్మ హర్షం వ్యక్తం చేశారు.

యూఎస్‌ఏ జర్నల్‌కు ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా డాక్టర్ సుధాకర్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ బుసిరెడ్డి సుధా కర్‌రెడ్డికి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) సైన్స్ పబ్లిషింగ్ గ్రూప్ నిర్వహిస్తున్న జర్నల్ ఆఫ్ ఫొటోనిక్ మెటీ రియల్స్ అండ్ టెక్నాలజీకి ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్-ఇండెక్స్, ఏడీ ఇండెక్స్ ర్యాంకింగ్, సైమాగో జర్నల్ ర్యాంకింగ్ (ఎస్‌జేఆర్), ఏఎస్సీఐ, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్, థామ్సన్ రాయిటర్స్ ఇంపాక్ట్ ఫ్యాక్టర్ జర్నల్స్ మరియు శక్తినిల్వ, డబ్ల్యూఎల్ఈడీలు, లేజర్లు క్వాంటం కంప్యూటింగ్‌లలో పరిశోధనలను నిర్వహించడానికి యూజీ సీ, సీఎస్ఐఆర్ ఆర్‌యుఎస్ఏ నిధులు సమకూర్చిన ఆరు పరిశోధన ప్రాజెక్టుల ఆధారంగా కమిటీ ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమిం చిందన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్ర నాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వెంకటసుబ్బయ్య, బోధనా సిబ్బంది అభినందించారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలి...కలెక్టర్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు రైతులు తప్పని సరిగా వేయించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యా లయంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు ఈ టీకాల కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,71,400 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయ న్నారు. నాలుగు నెలలు దాటిన నల్ల, తెల్ల పశువులకు రైతులు గాలి కుంటు నివారణకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శారదమ్మ, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో సోమవారం చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో అనంతపురం జట్టుపై గెలుపు సాధించింది. మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు కడప జట్టుపై ఇన్నింగ్స్ 69 పరుగుల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. వివరాలిలా.... ఏసీఏ క్రికెట్ స్టేడి యంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగు తున్న మ్యాచ్‌లో తొలుత అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. చిత్తూరు జట్టు మొదటి రోజు 33 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. రెండవ రోజైన సోమవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి 55.3 ఓవ ర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో తేజారెడ్డి 106 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టు 31 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించి ంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 46.2 ఓవర్లలో 142 పరుగు లకు ఆలౌట్ అయిం ది. బౌలింగ్ విభా గంలో చిత్తూరు బౌలర్ అచ్యు తానంద 5 వికెట్లు సాధించారు. దీంతో 111 పరుగుల స్వల్ప స్కోర్ ను ఛేదించే క్రమం లో చిత్తూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి 14.5 ఓవర్లలో రెండు వికె ట్లు మాత్రమే కోల్పోయి 113 పరుగులు సాధించి గెలుపొందింది.

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 43.5 ఓవర్లలో 257 పరు గులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 35.5 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. తిరిగి రెండో రోజు బ్యాటింగ్‌కు దిగి 86.1 ఓవర్లలో 501 పరుగుల భారీ స్కోర్ వద్ద ఆలౌట్ అయింది. ఇందులో కారుణ్యప్రసాద్ 167 పరు గులు సాధించి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో నెల్లూరు జట్టుకు 244 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బరి లోకి దిగిన కడప జట్టు 33.1 ఓవర్లలో 175 పరుగులకే చేతు లెత్తేసింది. కాగా బౌలింగ్ విభాగంలో నెల్లూరు జట్టు బౌలర్ అఖిల్ సాలుం 5 వికెట్లు పడగొట్టి జట్టు గెలుపునకు బాటలు వేశారు. దీంతో ఇన్నింగ్స్ 69 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు గెలుపొందింది.









అచ్యుతానంద, తేజారెడ్డి, అఖిల్ సాలంకె, కారుణ్యప్రసాద్

పడకేసిన పారిశుధ్యం

● రోగాల బారిన పడుతున్న జనం ● మొక్కుబడిగా పట్టణంలో శానిటేషన్ ● జనావాసాల నడుమ పేరుకుపోయిన చెత్తకుప్పలు

పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మొక్కుబడి తంతుగా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో 15 రోజులకు ఒక్కసారి చెత్త తొలగించడం గగనంగా మారింది. నిత్యం పీలేరు పట్టణంలో ప్రధాన రోడ్లకే పారిశుధ్య కార్యక్రమాలు పరిమితం కావడంతో ఇబ్బందుల తప్పడం లేదు. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు జనవాసాలు నడుమ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. పలు మార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు మురుగునీటి కాలువల క్లీనింగ్ ఇక చెప్పనక్కర్లేదు. రెండుమూడు నెలలకు ఒక్కసారి కూడా చేయడం లేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


చెత్తాచెదారంతో నిండిపోయిన మురుగునీటి కాలువ

పీలేరు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా పీలేరు పట్టణంలో శానిటేషన్ కార్యక్రమాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీలో సుమారు 121 మంది వర్కర్లు ఉన్నా పట్టణంలో మాత్రం పరిశుభ్రత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పారిశుధ్యంతో పాటు జనం దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడే మురుగునీరు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో రోజురోజుకూ దోమల బెడద అధికమైంది. దోమల నివారణ కోసం ఉన్న రెండు ఫాగింగ్ మిషన్లు పంచాయతీ స్టోర్ గదికే పరిమితమయ్యాయి. నెల క్రితమే ఫాగింగ్ పనులు ప్రారంభించిన అధికారులు ఒకట్రెండు రోజులకే మమా అనిపించడంపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఇందిరానగర్‌లో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త కుప్పలు

రోగాల బారిన ప్రజలు..

పీలేరు పట్టణంలో సుమారు 60 వేలకు పైగా జనాబా ఉన్నారు. పట్టణంలో దాదాపు రెండు వందల వీధులున్నాయి. శానిటేషన్ పనులు మొక్కుబడి తంతుగా జరుగుతున్నాయి. ఇక శివారు ప్రాంతాల పరిస్థితి చెప్పనక్కరలేదు. అత్యంత దుర్భరంగా ఉన్నాయి. నెలకోసారి సైతం వీధుల్లో చెత్త సేకరణ గగనంగా మారింది. ఎక్కడికక్కడే చెత్తాచెదారం పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారడంతో జనం రోగాలు బారిన పడుతున్నారు.

ప్రత్యేక చొరవ చూపాలి..



పట్టణంలో పారిశుధ్యం లోపించింది. దీనివల్ల రోజురోజుకూ దోమల బెడద అధికమవుతోంది. జనం రోగాలు బారిన పడుతున్నారు. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ చూపి శానిటేషన్‌పై దృష్టి సారించాలి.

\- వెంకటరత్నం, వేణుమహల్ రోడ్, పీలేరు

అవసరం మేరకు వర్కర్లు లేరు..



పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో అవసరం మేరకు శానిటేషన్ వర్కర్లు అందుబాటులో లేరు. ప్రస్తుతం 63 మంది ఉన్నారు. ఇందులో 8మంది డ్రైవర్లు మిగిలిన వారిలో రోజూ 15 నుంచి 20 మంది రకరకాల కారణాలతో విధులకు హాజరు కావడంలేదు. ఉన్న కార్మికులతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.

\- ఎస్. నౌషాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పీలేరు

13న విద్యుత్ ఉద్యోగుల సమావేశం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల ఓసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సమావేశం ఈనెల 13వ తేదీన ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రామలింగారెడ్డి, శేషాది నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ఇబ్రహీపట్నంలోని వీటీపీఎస్‌లో నిర్వహించే ఈ సమావేశంలో విద్యుత్ ఉద్యోగుల సమస్యల గురించి చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి డివిజన్‌లోని విద్యుత్ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, పెన్షనర్ల వేతన సవరణ కమిటీ ద్వారా మధ్యంతర భృతిని 30శాతానికి పెంచాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో వున్న 25వేల కోట్ల బకాయిల్లో 6వేల కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగిలిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మధుమతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, మండల నాయకులు భీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ

బి.కొత్తకోట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామంలో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను సోమవారం టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీరంగి గ్రామప్రజలు జయచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాచిపల్లె వెంకట సుబ్బారెడ్డి, దేవర శివారెడ్డి, పుర్రు సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

బి.కొత్తకోట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ బెంగళూరు రోడ్డులో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరు రోడ్ యూత్ అసోసియేషన్ తరుపున సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వాలీశ్వరస్వామి ఆలయ ముఖద్వారం ధ్వంసం

రామసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ బలసంద్రం గ్రామ సమీపంలోని వాలీశ్వరస్వామి ఆలయ ముఖద్వారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ ఆలయం అతి పురాతనమైనదని కావడంతో గుప్తనిధుల కోసమేనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బలమైన ఆలయ ముఖద్వారాన్ని చాలావరకు తవ్వేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇదిలా ఉండగా ఆలయానికి చెందిన భూములు కొంతమంది ఆక్రమించుకోగా ఎండోమెంట్ అధికారులు శనివారం సర్వే చేసి భూములు స్వాధీనం చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఆలయ ముఖద్వారం ధ్వంసం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా గతంలో ఇదే ఆలయ గజస్తంభాన్ని నిధుల కోసం దుండగులు కూల్చివేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దేవదాయ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


దుండగులు ధ్వంసం చేసిన ముఖద్వారం

భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ముదివేడు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరుతూ చీఫ్ ఇంజనీరింగ్ జలవనరుల శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ముదివేడు రిజర్వాయర్‌ను నిర్మించాలని అనేక అవకతవలకు పాల్పడి రైతులను ముంచేసిందన్నారు. సీపీఎం పోరాట ఫలితంగా ముంపునకు గురైన భూములు, ఇళ్ల గుర్తించడం కోసం గ్రామసభలు నిర్వహించి అవార్డు కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. దాదాపు 780ఎకరాలకు రూ.163కోట్లు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉండగా 25 ఎకరాలకు రూ.1.75 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలో ఐదు గ్రామాలు పూర్తిగా మునిగిపోయాయని, భూములు కూడా కోల్పోయారని తెలిపారు. ప్రతి కుటుంబానికి 5 సెంట్లు ఇంటి స్థలం, నిర్మాణం కోసం రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మణిశర్మ, నరసింహ, నిర్వాసితుల సంఘం నాయకులు రాజేష్, శ్రీనివాసులు, వెంకటరమణ, గోపాల్, వెంకటరెడ్డి, మాధవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఉనికి చాటుకునేందుకే వైసీపీ పోరుబాట

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్న కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఉనికి కోసమే వైసీపీ నాయకులు పోరుబాట కార్యక్రమం చేపట్టారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ దుయ్యబట్టారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెరిటేజ్ సంస్థలో ఉల్లిపాయలు అమ్ముతున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, స్వయంగా కలెక్టర్ పర్యవేక్షణలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారని గుర్తుచేశారు. ఉల్లి, పొగాకు, మిర్చి రైతులకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించిందన్నారు. మదనపల్లెలో టమోటా రైతులను ఆదుకుంటామని చెప్పిన జగన్ ఐదేళ్లలో ఏ రోజు టమోటా రైతుల గురించి ఆలోచించలేదన్నారు. నిజాలు తెలుసుకోకుండా వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్ నోటికొచ్చినట్లు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, చాంద్‌బాషా, చంద్రశేఖర్, కృష్ణప్ప, మణిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెద్దమండ్యం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి అశోక్ అన్నారు. మండలంలోని పాపేపల్లి పంచాయతీ గుడిసివారిపల్లిలో సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రెండు రోజుల నుండి ఆ గ్రామంలో పలువురు జ్వరాల బారిన పడ్డారు. అప్రమత్తమైన వైద్యాధికారులు ముందస్తుగా వైద్యశిబిరం నిర్వహించి రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండ చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జనార్ధన, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


జ్వరబాధితులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఘనంగా గురుపూజోత్సవం

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండల విద్యాశాఖ అధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న గుడ్డంపల్లె పాఠశాల అంజనేయులును ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో వెళ్లిన ఉపాధ్యాయులనూ సన్మానించి వీడ్కోలు పలికారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఐదుగురికి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తూ, తెలుగుదేశం పార్టీపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని వదిలిపెట్టమని పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర హెచ్చరించారు. సోమవారం మాజీ సర్పంచ్ ఉత్తమ్‌రెడ్డి, టీడీపీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడుతూ తంబళ్లపల్లెలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ కార్యకర్తల పేరుతో సోషల్ మీడియాలో ఇన్‌చార్జి పైన అసభ్యకరమైన పదజాలంతో అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని ఏఎస్ఐ నజీర్ బాషకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోముశేఖర్, బీఎంఆర్ రెడ్డప్ప, లోకేష్‌రెడ్డి, రామాంజులు, జయరాంరెడ్డి, జగదీష్, అల్లావుద్దీన్, గురుమూర్తి, ధనశేఖర్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లాపై అధికారిక ప్రకటన చేయాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లాపై అధికారిక ప్రకటన చేయాలని జిల్లా సాధన సమితి నేతలు తెలిపారు. సోమవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మదనపల్లె జిల్లా సాధన నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె జిల్లా సాధన కోసం గత ప్రభుత్వంలో రెండేళ్ల అనేక ఉద్యమాలు కొనసాగాయని, ఈక్రమంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం మదనపల్లె జిల్లా చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాయచోటి కేంద్రంగా మదనపల్లె జిల్లా అంశంపై చర్చలు జరుగుతున్నాయని, ఈ విషయం అధికారిక ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘాన్ని కలిసి నివేదికను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె జిల్లా సాధన నాయకులు యమల సుదర్శనం, రాందాస్ చౌదరి, దారం అనిత, సురేంద్ర యాదవ్, మనోహర్‌రెడ్డి, కృష్ణప్ప, శ్రీరాములు, మోడెం నాగరాజ, లలితమ్మ, ఆనందర్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జంగాల శివరాం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యం

● విద్యుత్ శాఖ ఈఈ గంగాధరం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు, వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఈఈ గంగాధరం అన్నారు. సోమవారం ఆయన ఏడిఈ గోవిందరెడ్డితో కలసి మండలంలోని కుక్కరాజుపల్లె 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రంలో అదనపు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో లోవోల్టేజి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్లలోని ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతరాయంగా అందించే విధంగా చూడాలని, పెండింగ్ విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈలు సురేంద్ర, శేషు, ఎల్ఐ భాస్కర్, లైన్‌మెన్లు శంకర, అమీన్, రమణ, ఇంతియాజ్, శ్రీకాంత్, సురేష్, డ్యూటీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో తగినంత యూరియా

● మండల ప్రత్యేకాధికారి దయాకర్‌రెడ్డి


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

కలకడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు తగినంత యూరియా అందుబాటులో ఉందని మండల ప్రత్యేకాధికారి దయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలకడ రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ యూరియా అవసరమైన రైతులు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బంది వద్ద ఈ క్రాప్ సర్టిఫికేట్, ఆధార్, భూమి పాసుపుస్తకం అందజేసి యూరియాను కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలకడ రైతు సేవా కేంద్రంలో 222, అలాగే దేవళ్లపల్లె 222 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ పశుగ్రాసం సాగుకు నానో యూరియాను పిచికారి చేయడం వలన అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది చందన, అనిల్, రైతులు పాల్గొన్నారు.

యూరియాను అధిక మోతాదులో వాడరాదు

గుర్రంకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతన్నలు సాగు చేసే పంటలకు అధిక మోతాదులో యూరియాను వాడరాదని ఏవో రత్నమ్మ అన్నారు. మండలంలోని తరిగొండ, సంగసముద్రం, టి.పసలవాండ్లపల్లె, నడిమి ఖండ్రిగ గ్రామాలో సోమవారం యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు యూరియాను అధిక మోతాదులో పంటలకు వాడుతున్నారని, దీనివల్ల భూసారం క్రమంగా తగ్గుతుందన్నారు. అంతేకాకుండా భూగర్భ జలాలు, నీటి వాగులు కలుషితమవుతాయన్నారు. పంటలకు చీడపీడలు పెరిగి దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులు యూరియా వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ చేయాలి

ములకలచెరువు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు డీఏపీ, యూరియాను పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, సహాయ కార్యదర్శి నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్ర ఎదుట సోమవారం సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఏపీ, యూరియా అందుబాటులో లేక 20 రోజుల నుంచి రైతాంగం ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా కావాలంటే రైతులు పక్కనున్న కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్నారన్నారు. అనంతరం ఏవో స్రవంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, గంగులప్ప, సుబ్బన్న, జయకర్, రామచంద్ర, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన ఉండాలి

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా వినియోగంపై రైతులకు అవగాహన ఉండాలని మండల వ్యవసాయాధికారి ప్రేమలత అన్నారు. సోమవారం మండలంలోని అంకిరెడ్డిపల్లె రైతుసేవా కేంద్రంలో రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు యూరియాను అధికంగా వాడడం వలన కలిగే అనర్థాలను, నానో యూరియా వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. యూరియాను పంటలకు తగు మోతాదులో వినియోగించాలన్నారు. వర్మీకంపోస్టు, పశువుల ఎరువులను ఉపయోగించుకోవడం వలన దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించాలి

వాల్మీకిపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో మాదిరిగా ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాదిగా సమావేశం నిర్వహించకపోవడంతో మండలంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలు ఎక్కువై ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు సుధాకర్, రాష్ట్ర గిరిజన సంఘం నాయకుడు జీవీ రమణ, దళిత నాయకులు వెంకటస్వామి, నాగార్జున, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలి

గుర్రంకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో రైతులను పట్టిపీడిస్తున్న జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలని రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై రైతులను దోచుకొంటున్నారని, అంతేకాకుండా రైతు 25కిలోల బరువు గల 100 టమోటా క్రేట్‌లను మార్కెట్‌కు తీసుకొస్తే 16క్రేట్‌లను జాక్‌పాట్ విధానంతో దోచుకొంటున్నారని తెలిపారు. అలాగే కమీషన్ 4శాతానికి బదులుగా 10శాతం వసూలు చేస్తున్నారని, వేలంలో పాడిన పాటను కాకుండా ధరలను తగ్గించి రైతులకు అన్యాయం చేస్తున్నట్లు ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ మార్కెట్ యార్డులో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

మెడికల్ కళాశాల నిర్మాణంలో రూ.15కోట్లు కొల్లగొట్టారు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణంలో వైసీపీ నాయకులు రూ.65 కోట్లు బిల్లులు చేసుకుని అందులో రూ.15కోట్లకు పైగా కొల్లగొట్టారని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆరోపించారు. సోమవారం మండలంలోని ఆరోగ్యవరం వద్ద అసంపూర్తిగా నిలిపివేసిన మెడికల్ కళాశాల భవనాల వద్ద ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు అక్కడ ప్రెస్‌మీట్ పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రూ.445 కోట్ల అంచనాతో మొదలు పెట్టిన మెడికల్ కళాశాల నిర్మాణంలో రూ.65 కోట్ల బిల్లులు డ్రా చేశారన్నారు. అప్పట్లో ఈ నిర్మాణాల నాణ్యత పరిశీలించేందుకు అనుమతించలేదన్నారు. నాణ్యత లేని ఇసుక, మట్టి, కంకర, సిమెంటు తరలించి పెద్దఎత్తున బిల్లులు చేసుకున్నారన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విద్యాసాగర్, మోడెం సిద్దప్ప, షంషీర్, శివన్న, సహదేవనాయుడు, తలారి రాధ, భారతి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా, తదితరులు

పలు ఆలయాల్లో విశేష పూజలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో చంద్రగ్రహణం అనంతరం సోమవారం నిర్వహకులు విశేషపూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా దేవళం వీధిలోని పర్సన్న వెంకటరమణ ఆలయంలో ఈవో రమణ ఆధ్వర్యంలో విశేషంగా అలంకరణ చేసి దూపదీప నైవేధ్యాలు సమర్పించి పూజల చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే నీరుగుట్టువారిపల్లెలో నీలకంఠేశ్వరస్వామిని నిర్వహకులు, ధర్మకర్తలు విశేషంగా పూజలు చేశారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించారు. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో ఉదయం నుంచి ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్టు ఆవరణంలో వెలసిన కోర్టులో గంగమ్మకు ఆలయకమిటీ సభ్యులు అమ్మవారికి విశేషాలంకరణలతో పూజలు నిర్వహించారు. అలాగే బర్మావీధిలోని షిర్డిడి సాయిబాబా ఆలయంలో, దేవళంవీధి సోమేశ్వర స్వామి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


మంజునాథస్వామిని దర్శించుకున్న భక్తులు

గ్రహణదోష నివారణ పూజలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గ్రహణదోష నివారణ పూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమంతో పాటు పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.